Estd:2008

FEARLESS JOURNALISM, OUR HABIT, OUR HISTORY!

RNI.No.APTEL/2013/54714

నిరంతర వార్తా స్రవంతి

# జనం

తెలుగుదినపత్రిక

NIRANTARA VAARTHA SRAVANTHI JANAM

Published from Guntur, Hyderabad, Kurnool, Vijayawada

గుంటూరు సంపుటి : 9 | సంచిక :349 | ఎడిటర్ : దావులూరి హనుమంతరావు | 01-10-2023 ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ. 1/-


## గత పాలకులకు మనసు లేదు.. మీకు మంచి జరిగిందనిపిస్తే నాకు తోడుగా నిలవండి: సీఎం జగన్

విజయవాడ (ఎఎంఎస్) : త్వరలో కురుక్షేత్ర యుద్ధం జరగబోతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నిరుపేదల వైపు నిలబడిన ప్రభుత్వానికి, పేదలను వంచించిన గత ప్రభుత్వానికి మధ్య యుద్ధం జరగబోతుందని తెలిపారు. పేదలకు, పెత్తందారులకూ మధ్య యుద్ధం జరగనుందని పేర్కొన్నారు. అమరావతి పేరుతో స్కామ్, స్కిల్ స్కామ్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ గ్రిడ్, నీరు–చెట్టు పేరుతో దోపిడీ చేసిన వారితో యుద్ధం జరగబోతుందని మండిపడ్డారు. ఈ మేరకు విజయవాడలో వరుసగా అయిదో ఏడాది వాహనమిత్ర నిధులను సీఎం జగన్ శుక్రవారం విడుదల చేశారు. వాహనమిత్రతో ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లకు లబ్ధి పొందుతుండగా.. 2,75,931 మంది ఖాతాల్లోకి రూ. 10 వేల చొప్పున జమచేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. 99శాతం హామీలు అమలు చేశామని తెలిపారు. మన ప్రభుత్వం వాయిస్ ఆఫ్ ది వాయిస్ లెస్ అని పేర్కొన్నారు. ఒకవైపు పేదల ప్రభుత్వం ఉంటే మరోవైపు పేదల్ని మోసగించిన వారు ఉన్నారని విమర్శించారు. 'మన ప్రభుత్వం మనసున్న ప్రభుత్వం. గత పాలకులకు మనసు లేదు. పేదల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం మనది. మేనిఫెస్టోలో చెప్పిన ప్రతీ హామీని అమలు చేశాం. మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసిన ప్రభుత్వం గత ప్రభుత్వం. లంచం, వివక్ష లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేశాం. గతంలోనూ ఇదే బడ్జెట్, మారిందల్లా సీఎం ఒక్కడే. గతంలో ఎందుకు ఈ పథకాలు ఇవ్వలేకపోయారు? పేదవాడి ప్రభుత్వం నిలబడాలి. పెత్తందారుల ప్రభుత్వం రాకూడదు. వచ్చే ఎన్నికలప్పుడు వీటన్నింటి గురించి ఆలోచించాలని సూచించారు. వాళ్లకు అధికారం కావాల్సింది దోచుకోవడానికి, దోచుకున్నది పంచుకోవడానికి.. వాళ్లలాగా నాకు దత్తపుత్రుడి తోడు లేదు. వాళ్లు మాదిరిగా నాకు గజదొంగల ముఠా తోడుగా లేదు. దోచుకొని పంచుకొని తినడం నా విధానం కాదు. మీ ఇంట్లో మంచి జరిగిందనిపిస్తే నాకు తోడుగా నిలవండి. ఈ కురుక్షేత్ర యుద్ధంలో నాకు అండగా నిలబడండి. ఓటు వేసే ముందు జరిగిన మంచి గురించి ఆలోచించండి.' అని సీఎం జగన్ పేర్కొన్నారు.

## అందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు: సీఎం జగన్

### ఆరోగ్య సురక్ష' ప్రారంభించిన సీఎం జగన్

అమరావతి (ఎఎంఎస్) : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. 45 రోజులపాటు ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ, గ్రామస్థాయి నుంచి జిల్లా కలెక్టర్ వరకు అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములేనన్నారు. 10,032 సచివాలయాల పరిధిలో విలేజ్ క్లినిక్స్ అందుబాటులోకి తెచ్చామన్నారు. "ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లను అందుబాటులో ఉంచుతున్నాం. ప్రతి గ్రామాన్ని, ప్రతి ఇంటిని జల్లెడ పడతాం. ప్రతి ఒక్కరికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తాం. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి నయం అయ్యే వరకు తోడుంటాం" అని సీఎం స్పష్టం చేశారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు. ఒక డాక్టర్ పీహెచ్‌సీలో ఉంటే ఇంకో డాక్టర్ అంబులెన్స్‌లో గ్రామాల్లోకి వెళ్తారు" అని సీఎం జగన్ తెలిపారు.

## లోకేష్ లోకేషన్ ఎక్కడ? కార్లు మారుస్తూ రహస్య మీటింగ్‌లు!

న్యూఢిల్లీ (జిఎన్ఎస్) : నారా లోకేష్ కోసం ఢిల్లీలో ఏపీ సీఐడీ అధికారుల వెతుకులాట ప్రారంభించారు. లోకేష్ కోసం పలు చోట్లు సీఐడీ అధికారులు వాకబు చేశారు. కావాలనే సీఐడి అధికారుల నుంచి తప్పించుకుంటున్నట్లు అనుమానం. రింగ్ రోడ్ కేసులో లోకేష్‌కి 41ఏ సీఆర్పీసీ నోటీసులు ఇచ్చేందుకు సీఐడీ అధికారులు ఢిల్లీకి వెళ్లారు. నోటీసులు తీసుకుని విచారణలో అధికారులకు సహకరించాలని లోకేష్‌ని ఏపీ హైకోర్టు ఆదేశించింది. అయినా సీఐడీ అధికారులకు అందకుండా లోకేష్ దాగుడు మూతలు ఆడుతున్నారు. ఇక స్కిల్ స్కాం, ఫైబర్‌నెట్ కేసుల్లో ముందస్తు బెయిల్ పిటిషన్ లోకేష్ వేయగా, ఆయన పిటిషన్‌ను కోర్టులో వ్యతిరేకించాలని సీఐడీ నిర్ణయించింది. మరోవైపు, మీడియాకు కంటపడకుండా లోకేష్ తిరుగుతున్నారు. కార్లు మారుస్తూ రహస్యంగా మీటింగులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. నిన్నటి నుంచి గల్లా జయదేవ్ ఇంటికి రాని లోకేష్.. ఐటీసి మౌర్య నుంచి మరో చోటకు మకాం మార్చినట్లు తెలిసింది. జయదేవ్ కంపెనీ గెస్ట్ హౌస్ లో ఉన్నారని సమాచారం ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో హై కోర్ట్ ఎదురుదెబ్బ తగలడంతో న్యాయవాదులతో లోకేష్ మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది.

## ఇస్కాన్‌పై సంచలన ఆరోపణలు.. మేనకా గాంధీకి బిగ్ షాక్

న్యూఢిల్లీ (జిఎన్ఎస్) : బీజేపీ సీనియర్ నేత, మేనకాగాంధీకి బిగ్ షాక్ తగిలింది. ఎంపీ మేనకా గాంధీపై రూ.100 కోట్ల పరువు నష్టం దావా దాఖలు చేసేందుకు ఇస్కాన్ సిద్ధమైంది. ఈ మేరకు నోటీసులు జారీ అయ్యాయి. అయితే, ఇటీవల మేనకా గాంధీ.. గోశాలల్లో ఉన్న గోవుల్ని ఇస్కాన్ అమ్ముకుంటున్నదని సంచలన ఆరోపణలు చేశారు. దీంతో, ఇస్కాన్ తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. ఇక, మేనకా గాంధీ వ్యాఖ్యలపై కోల్‌కతాలోని ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రాధారమణ్ దాస్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. మేనకా గాంధీ వ్యాఖ్యలు దురదృష్టకరమని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇస్కాన్ భక్తుల్ని ఆమె వ్యాఖ్యలు బాధించాయన్నారు. ఆమెపై వంద కోట్ల పరువునష్టం కేసు వేసేందుకు న్యాయ ప్రక్రియ చేపట్టామని, ఇవాళ ఆమెకు నోటీసు జారీచేశామని చెప్పుకొచ్చారు. మాజీ కేంద్ర మంత్రి, ఎంపీ అయిన ఆమె ఎటువంటి ఆధారాలు లేకుండా ఇంత పెద్ద సంస్థపై ఎలా ఆరోపణలు చేశారని ఆయన మండిపడ్డారు. అంతకుముందు కూడా.. మేనకా గాంధీ చేసిన ఆరోపణలను ఇస్కాన్ ఖండించింది. ఆమె ఆరోపణలు నిరాధారమైనవని, తప్పుడువని ఇస్కాన్ పేర్కొన్నది. గోవులు, ఆవుల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఇస్కాన్ జాతీయ ప్రతినిధి యుదిష్టర్ గోవింద దాస్ తెలిపారు. కేవలం ఇండియాలోనే కాదు, యావత్ ప్రపంచవ్యాప్తంగా తాము గోవుల్ని ఆదరించనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది.

## వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం కలిసికట్టుగా పని చేస్తాం

విజయవాడ ౨ : అక్టోబర్ ఒకటి నుంచి కృష్ణాజిల్లాలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర ఉంటుందని.. పార్టీ క్యాడర్ సిద్ధం కావాలని జనసేన అధినేత నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..."ఆదివారం సాయంత్రం అవనిగడ్డలో పవన్ కళ్యాణ్ బహిరంగ సభతో ఈ యాత్ర ప్రారంభం అవుతుంది. జనసేన – తెలుగుదేశం – బీజేపీ కలయికతో ఈసారి వారాహి యాత్ర సాగుతుంది. ఈ యాత్ర తర్వాత రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారతాయి. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం కలిసికట్టుగా పని చేస్తాం. 151 స్థానాలు ఇస్తే ఈ ప్రభుత్వం కక్షతో పాలన చేస్తోంది. చంద్రబాబు అక్రమ అరెస్టు రాజకీయ కక్షతో చేసిందే. అన్ని వ్యవస్థలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాశనం చేశాడు. ఏపీలో ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పలేని పరిస్థితి. టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ సమావేశం త్వరలో జరుగుతుంది. సోషల్ మీడియా వేదికగా మా పొత్తులపై వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారు. అలాం పోస్ట్‌లు, వ్యాఖ్యలపై ఎవరూ స్పందించవద్దు. మన పొత్తులు పదవుల కోసం కాదు.. రాష్ట్రం, ప్రజల క్షేమం కోసం. వైసీపీలో మంత్రులతో సహా ప్రతిపక్షాలను బూతులు తిట్టినా కేసులు ఉండవు. వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలను ఎత్తి చూపితే మాత్రం కేసులు పెట్టి అక్రమ అరెస్టు చేస్తున్నారు. ఇలాంటి నియంతృత్వ పాలనకు చరమ గీతం పాడాలి. త్వరలోనే మన ప్రజా ప్రభుత్వం వస్తుంది.. రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది" అని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## అసెంబ్లీలో టీడీపీ తన వాదన చెప్పుకోలేకపోయింది

విజయనగరం (ఎఎంఎస్) : దోచుకుతిన్న వారు ధర్నాలు చేసినపుడు వదిలిపెడితే అందరూ అదే త్రోవలో వెళ్తారని మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. మంత్రి మీడియాతో మాట్లాడారు. "అనేక కేసుల్లో మొన్నటి వరకు స్టేలు తెచ్చుకొని చంద్రబాబు బ్రతికారు. ఇప్పుడు అడ్డంగా దొరికిపోయారు. అసెంబ్లీలో తమ వాదన టీడీపీ చెప్పుకోలేకపోయింది. ఓపీఎస్ అమలు చేస్తామని చెప్పినప్పటికీ.. అన్నీ ఆలోచించిన తర్వాత చేయలేమని చెప్పాం. అందుకే జీపీఎస్ అమలు చేశాం. ఐదు కోట్ల మంది ప్రజల అవసరాలు ముఖ్యం. ఏ ఒక్క వర్గం మేలు కోసం ప్రభుత్వం పనిచేయదు. ఈ మధ్య నాయకుల్లో సమన్వయం కొరవడింది. ఎమ్మెల్యేలు చక్రవర్తులు మాదిరిగా.. ఎంపీపీలు సామంతులు మాదిరిగా చలామణి అవుతున్నారు. ఇది తప్పు అని చెబుతున్నాను." అని బొత్స చెప్పుకొచ్చారు.

## బీజేపీ ఒత్తిడితోనే చంద్రబాబు అరెస్ట్

శ్రీసత్యసాయి జిల్లా (ఎఎంఎస్): బీజేపీ ఒత్తిడితోనే టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు జరిగిందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మెంబర్ రఘువీరారెడ్డి వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం తుపాకీ పెట్టి వ్యవహారాలు నడిపిస్తోందని ఆరోపించారు. టీడీపీ నిరసనలు, ఉద్యమాలు ఎన్ని చేపట్టిన ప్రయోజనం శూన్యమన్నారు. చంద్రబాబుపై పెట్టిన కేసులన్నీ కోర్టు పరిధిలో ఉన్నాయని... కాబట్టి టీడీపీ కోర్టులోనే పరిష్కారం చేసుకోవాలని సూచించారు. బీజేపీ, ప్రధాని మోదీ, అమిత్ షాలకు తెలియకుండా చంద్రబాబు అరెస్ట్ జరగదని అన్నారు. వీటన్నింటికీ మూల కారణం ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ బలపడాలన్నది ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఏదో ఒకరోజు జగన్‌కు కూడా ఇదే పరిస్థితి రాకుండా ఉండదని రఘువీరారెడ్డి హెచ్చరించారు.

## దొంగతనం చేసి సానుభూతి కోరుకుంటున్నారు: సజ్జల

అమరావతి (ఎఎంఎస్): అడ్డంగా దొరికిన దోపిడీ దొంగల ముఠాకు ఎల్లో సపోర్ట్ చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎల్లో మీడియాకు వాస్తవాలతో సంబంధం లేదని, జనం నమ్మక చస్తారా అనేదే ఎల్లో మీడియా ఆలోచన అంటూ దుయ్యబట్టారు. "వీరంతా తోడు దొంగలే.. ఇంతకంటే పెద్ద పదం లేదు. లక్ష మంది గోబెల్స్ కలిస్తే ఒక చంద్రబాబు.. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఇష్టానుసారం దోచుకున్నారు. టీడీపీ అంటే తోడు దొంగల పార్టీ. ముఠా నాయకుడు చంద్రబాబును కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారు. స్కాం దర్యాప్తులో ప్రభుత్వ ప్రమేయం లేదు. ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉంది. ఈ 20 రోజుల్లో లోకేశ్ ముఠా నానా యాగీ చేసింది. ప్రజలకు సంబంధించిన సొమ్ము దోపిడీకి గురైంది" అని సజ్జల పేర్కొన్నారు.

## స్కిల్ స్కామ్‌పై టీడీపీ నేతలు అబద్ధాలు:మంత్రి కాకాణి

నెల్లూరు జిల్లా (ఎఎంఎస్) : స్కిల్ డెవలప్‌మెంట్ పథకంలో కుంభకోణం జరిగిందని సీఐడీ గుర్తించిందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు ప్రభుత్వ హయాంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయలేదు, కానీ ఇక్కడికి వచ్చి టీడీపీ నేతలు తాము స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశామని హడావుడి చేశారు. అప్పట్లో నెల్లూరు జిల్లాలో కేవలం రెండు కళాశాలలలో మాత్రమే ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారు. చంద్రబాబు హయాంలో యూనివర్సిటీల్లో ఏర్పాటు చేశామని టీడీపీ నేతలు అబద్ధాలు చెప్పారు" అని మంత్రి మండిపడ్డారు. "రూ.3 వేల 370 కోట్ల పథకంలో 370 కోట్లను చంద్రబాబు కొట్టేశారు. సీమెన్స్ కంపెనీ పేరుతో డబ్బులు స్వాహా చేశారు. మాకు ఈ పథకంతో సంబంధం లేదని సీమెన్స్ ఇండియా సంస్థ చెబుతోంది. టీడీపీ నేతలు ఆలోచన లేకుండా యూనివర్సిటీకి వచ్చి అబద్ధాలు చెప్పారు. చంద్రబాబు కుంభకోణానికి పాల్పడలేదని యూనివర్శిటీలోని కంప్యూటర్లు చూపెడుతున్నారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనానికి తిరుపతి ఎంపీ గురుమూర్తి నిధులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు" అని మంత్రి కాకాణి పేర్కొన్నారు. "ఈ కేంద్రాన్ని చూపించి టీడీపీ ప్రభుత్వంలో వచ్చిందని ఆ పార్టీ నేతలు అబద్ధాలు చెబుతున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా విశ్వవిద్యాలయానికి రూ.57 కోట్లు నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు.. కానీ పైసా కూడా నిధులు ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విశ్వవిద్యాలయంలో లైబ్రరీ.. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌తో పాటు హాస్టళ్లను నిర్మించాం" అని మంత్రి కాకాణి తెలిపారు.

# సంపాదకీయం...

## హరిత విప్లవ పితామహుడు

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ కన్నుమూత 'భారత వ్యవసాయ రంగంలో ఓ శకం ముగిసింది. భారత హరిత విప్లవ పితామహుడిగా ప్రఖ్యాతిగాంచిన ఎంఎస్ స్వామినాథన్ (98) కన్నుమూశారు. గత కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలతో పోరాడుతున్న ఆయన చెన్నైలో తుదిశ్వాస విడిచారు. ఆహారాభివృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు స్వామినాథన్ ఎనలేని సేవ చేశారు. దేశంలో ఆహార కొరతను ఎదుర్కొనడానికి మేలైన వరి వంగడాలను స్వామినాథన్ సృష్టించారు'. 1960 నుంచి 1970ల్లో స్వామినాథన్ చేసిన కృషి భారత వ్యవసాయ రంగాన్ని విప్లవాత్మకంగా మార్చింది. కరువు కోరల్లో చిక్కుకున్న భారత వ్యవసాయ రంగాన్ని స్వయం సమృద్ధి వైపుకు మరలించారు. అధిక దిగుబడినిచ్చే గోధుమ, వరి వంగడాలను సృష్టించి వ్యవసాయ ఉత్పాదకతను అమాంతం పెంచారు. వ్యవసాయ రంగంలో వినూత్న విధానాలతో స్థానిక పరిస్థితులపై లోతైన అవగాహనతో ఆధునిక శాస్త్రీయ పద్ధతులను మిళితం చేశారు స్వామినాథన్. దీంతో ఎంతోమంది తక్కువ ఆదాయ రైతులు దేశాభివృద్ధికి గణనీయంగా తోడ్పాటునిచ్చారు. స్వామినాథన్ చేసిన సేవలకు గాను 1987లో మొదటి వరల్డ్ ఫుడ్ ప్రైజ్‌ను అందుకున్నారు. ఆ డబ్బుతో ఆయన చెన్నైలో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించారు. 1971లో స్వామినాథన్‌కు రామన్ మెగసెసే అవార్డు, 1986లో అల్బర్ట్ ఐన్‌స్టీన్ సైన్స్ అవార్డ్‌లతో సత్కరించారు. భారత్‌లో చేసిన సేవల కంటే స్వామినాథన్ ప్రపంచ వేదికపై ఎంతో ప్రభావవంతమైన వ్యక్తిగా గుర్తింపు పొందారు. వివిధ అంతర్జాతీయ వ్యవసాయ, పర్యావరణ కార్యక్రమాలకు ఆయన మేధస్సును అందించారు. టైమ్ మ్యాగజైన్ 20వ శతాబ్దపు అత్యంత ప్రభావవంతమైన 20 మంది ఆసియన్లలో ఒకరిగా ఆయనకు స్థానం దక్కింది. మొన్కొంబు సాంబశివన్ స్వామినాథన్ భారత వ్యవసాయ శాస్త్రవేత్త, జన్యుశాస్త్ర నిపుణుడు. అతనిని భారత దేశంలో 'హరిత విప్లవ పితామహుడు' గా పేర్కొంటారు. అతను 'ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్' ను స్థాపించి దాని చైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు. అతను ప్రపంచంలో ఆకలి, పేదరికం తగ్గించడంపై ప్రధానంగా దృష్టి పెట్టాడు. అలాగే ఇతర దేశాలకు చెందిన ఎన్నో మేలైన వరి రకాలను మన దేశంలోకి ప్రవేశపెట్టి, వాటి నుండి కొత్త వరి రకాలను ఉత్పత్తి చేశాడు. వరి, గోధుమ మొదలైన పంటలపై ఈయన జరిపిన విశేష కృషి వలన భారత దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగి హరిత విప్లవాన్ని సాధించింది. స్వామినాథన్ ఎన్నో గొప్ప పదవులను సమర్థవంతంగా నిర్వహించాడు. 1972 నుండి 1979 వరకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సంస్థకు జనరల్ డైరక్టరుగా పని చేసాడు. 1979 నుండి 1980 వరకు భారతదేశ వ్యవసాయ మంత్రిత్వశాఖకు ప్రధాన కార్యదర్శిగా పని చేశాడు. అతను అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థకు 1982 నుండి 1988 వరకు డైరక్టరు జనరల్‌గా సేవలనందించాడు. 1988లో ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ద కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రీసోర్స్ సంస్థకు అధ్యక్షునిగా ఉన్నాడు. 1999లో 20వ శతాబ్దంలో అత్యధికంగా ప్రభావితం చేసిన ఆసియా ప్రజల జాబితా 'టైం 20'లో అతని పేరును టైమ్స్ మ్యాగజైన్ ప్రచురించింది. స్వామినాథన్ 1925 ఆగస్టు 7న కుంభకోణంలో జన్మించారు. పద్మశ్రీ (1967), రామన్ మెగసెసే (1971), పద్మభూషణ్ (1972), ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వరల్డ్ అవార్డ్ ఆఫ్ సైన్స్ (1986), పద్మవిభూషణ (1989), వరల్డ్ ఫుడ్ ప్రైజ్ (1987), టైలర్ ప్రైజ్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ అచీవ్‌మెంటు (1991), వోల్వో ఎన్విరాన్‌మెంటల్ ప్రైజ్ (1999), ఇందిరా గాంధీ శాంతి బహుమతి (1999), ఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం (2013) వంటి పురస్కారాలు అందుకున్నారు. భూములకు నీటి పారుదల సౌకర్యాన్ని కల్పించి, యాంత్రీకరణను ప్రవేశపెట్టి, రసాయనిక ఎరువులను, క్రిమిసంహారక మందులను వాడి, సంకర జాతి వంగడాలతో స్వల్పకాలంలో అధిక దిగుబడిని సాధించే వ్యవసాయ విధానాన్ని హరిత విప్లవం) అంటారు.

ఇది తొలిసారి మెక్సికోలో 1945లో ప్రారంభమైంది. పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడానికి మెక్సికో ప్రభుత్వం వివిధ రకాలైన గోధుమ వంగడాలను అభివృద్ధి చేసింది. మెక్సికోలో నార్మన్ బోర్లాగ్ నేతృత్వంలో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ ఈ విప్లవాన్ని ఇతర దేశాలను విస్తరించడానికి నిర్ణయించింది. అదే సమయంలో 1960లో భారత్ తీవ్ర కరవు పరిస్థితులు ఎదుర్కొంది. ఆ సమయంలో కేంద్ర వ్యవసాయ శాఖకు సలహాదారుగా ఉన్న ఎంఎస్ స్వామినాథన్ మెక్సికో హరిత విప్లవ పితామహుడు నార్మన్ బోర్లాగ్‌ను దేశానికి ఆహ్వానించారు. ప్రభుత్వపరం గా ఇబ్బందులున్నప్పటికీ మెక్సికో ప్రయోగశాల నుంచి గోధుమను దిగుమతి చేసుకుని ప్రయోగాత్మకంగా పంజాబ్‌లో పండించారు. అవి మంచి దిగుబడి రావడంతో భారత్‌లో హరిత విప్లవానికి నాంది పలికినట్లయింది. దీంతో స్వామినాథన్‌ను భారత హరిత విప్లవ పితామహుడిగా అభివర్ణిస్తారు. దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిని గణనీయంగా పెంచడంలో స్వామినాథన్ విశేష కృషి చేశారు. అధిక దిగుబడినిచ్చే వరి, గోధుమ వంగడాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. స్వామినాథన్‌కు ముగ్గురు కుమార్తెలు. వీరిలో ఒకరైన సౌమ్య స్వామినాథన్ ప్రపంచ ఆరోగ్య సంస్థలో 2019 నుంచి 2022 వరకు చీఫ్ సైంటిస్ట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కరోనా సమయంలో ప్రపంచ వ్యాప్తంగా వైరస్ వ్యాప్తి కట్టడి కోసం ఆమె ఎంతో కృషి చేశారు. స్వామినాథన్ 1925 ఆగస్టు 7న అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని కుంభకోణంలో జన్మించారు. ఆయన తండ్రి ఎంకె సాంబశివన్ సర్జన్. మెట్రిక్యులేషన్ పూర్తయిన తర్వాత స్వామినాథన్ కూడా తండ్రి బాటలోనే మెడికల్ స్కూల్లో చేరారు. కాని 1943లో బెంగాల్‌లో చోటుచేసుకున్న క్షామాన్ని కళ్లారా చూసిన ఆయన చలించిపోయారు. దేశాన్ని ఆకలి నుంచి కాపాడాలన్న లక్ష్యంతో వైద్యరంగం నుంచి తన మనసు మార్చుకుని వ్యవసాయ పరిశోధనల వైపు అడుగువేశారు. త్రివేంద్రంలోని మహారాజా కాలేజీలో జువాలజీ నుంచి యుజి డిగ్రీ పట్టా పొందిన ఆయన.. ఆ తర్వాత మద్రాసు అగ్రికల్చరల్ కాలేజీలో చేరారు. అగ్రికల్చరల్ సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ లో పిజి చదివారు. పిజి పూర్తయిన తర్వాత స్వామినాథన్ యుపిఎస్‌సి పరీక్ష రాసి ఐపిఎస్‌కు అర్హత సాధించారు. కాని ఆ అవకాశాన్ని వదులుకుని యునెస్కో ఫెలోషిప్‌తో నెదర్లాండ్స్‌లోని అగ్రికల్చరల్ యూనివర్శిటీలో చేరారు. అక్కడ బంగాళదుంప జన్యుపరిణామంపై అధ్యయనం చేశారు.

## శివసేన వర్గాల అనర్హత పిటిషన్లపై స్పీకర్ విచారణ షురూ..

ముంబై (ఎఎంఎస్) : మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే శివసేన వర్గం, ఉద్ధవ్ థాకరే శివసేన వర్గం పరస్పరం దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్ సోమవారంనాడు విచారణ ప్రారంభించారు. విచారణకు హాజరుకావాలని 53 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ ఇటీవల నోటీసులు పంపగా, వీరిలో 40 మంది షిండే వర్గానికి, 13 మంది ఎమ్మెల్యేలు థాకరే వర్గానికి చెందిన వారున్నారు. కాగా, నోటీసులు అందుకున్న ఎమ్మెల్యేలలో ఎక్కువ మంది తమ తరఫు లాయర్లను విచారణకు పంపారు. ఉద్ధవ్ థాకరే వర్గంతో తెగతెంపులు చేసుకున్న ఏక్‌నాథ్ షిండే 2022 జూన్‌లో బీజేపీకి మద్దతు ఇవ్వడం ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. తమదే అసలైన శివసేన వర్గంగా ఆయన క్లెయిమ్ చేసుకున్నారు. ఉద్ధవ్ థాకరే సైతం శివసేన తమదేనని, పార్టీ నుంచి వెళ్లిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. అత్యధిక ఎమ్మెల్యేలు తనతోనే ఉన్నందున థాకరే వర్గం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోరుతూ షిండే సైతం స్పీకర్‌ను ఆశ్రయించారు. ఈ వివాదం సుప్రీంకోర్టుకు చేరడంతో అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి ఎంత సమయం పడుతుందో వారంలోగా చెప్పాలని అత్యున్నత న్యాయస్థానం గతవారంలో నార్వేకర్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో మొత్తం తనకు అందిన 34 పిటిషన్లపై స్పీకర్ విచారణను ప్రారంభించారు. మహారాష్ట్రలో తలెత్తిన రాజకీయ సంక్షోభంపై గత మే 11న సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ, మహారాష్ట్ర సీఎంగా షిండే కొనసాగుతారని, షిండే తిరుగుబాటు తర్వాత అసెంబ్లీలో బలపరీక్షకు వెళ్లకుండా ఉద్ధవ్ థాకరే రాజీనామా చేసినందున తిరిగి మహా వికాస్ అఘాడి ప్రభుత్వం ఏర్పాటుకు ఆదేశించలేమని స్పష్టం చేసింది.

## నితీశ్ వేడుకున్నా.. ఎన్డీఏలో చేర్చుకోం: సుశీల్ కుమార్ మోదీ

పాట్నా (ఎఎంఎస్) : బిహార్ సీఎం, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ఎన్డీలో చేరాలని భావిస్తున్నారనే వార్తలను ఆ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత సుశీల్ కుమార్ మోదీ ఖండించారు. ఎట్టి పరిస్థితుల్లో నితీశ్ ను ఎన్డీఏలో చేర్చుకునేది లేదని స్పష్టం చేశారు. నితీశ్ తాజాగా బీజేపీకి చెందిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో ఆయన మళ్లీ బీజేపీతో జత కడుతున్నారు అనే రూమర్స్ బయటకి వచ్చాయి. ఈ అంశంపై స్పందించిన సుశీల్ మాట్లాడుతూ.. నితీశ్ కు ఎన్డీఏ తలుపులు మూసుకుపోయాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారని.. ఇదే విషయాన్ని రెండు సార్లు నొక్కివక్కానించారని పేర్కొన్నారు. రానున్న లోక్ సభ ఎన్నికలతో పాటు 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా పోటీ చేస్తుందని.. అంతిమ విజయం తమ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం నితీశ్ మీడియాతో మాట్లాడుతూ తాను మళ్లీ ఎన్డీఏలోకి వెళ్లవచ్చేనేలా సంకేతాలిస్తూ మాట్లాడటంతో ఆ కూటమిలో చేరిక అంశం లాంఛనమే అని భావించారు పొలిటికల్ విశ్లేషకులు.

## సత్యేంద్ర జైన్ బెయిల్ మరోసారి పొడిగించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ (జిఎన్ఎస్) : ఢిల్లీ మాజీ మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేత సత్యేంద్ర జైన్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్‌ను మరోసారి పొడిగించింది. అక్టోబర్ 9 వరకు బెయిల్ పొడిగింపును మంజూరు చేసింది. మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ అయిన ఆయనకు తొలుత మే 26న మెడికల్ బెయిల్ మంజూరు చేశారు. జులై 21న వెన్నెముకకు ఆపరేషన్ జరగడంతో బెయిల్ గడువును పొడగిస్తూ వచ్చింది కోర్టు. తాజా పొడగింపు అనంతరం విచారణకు తప్పకుండా హాజరుకావాలని సూచించింది. తదుపరి విచారణ వరకు బెయిల్‌ను పొడిగిస్తూ, న్యాయమూర్తులు జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ బేల ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం నిర్ణయించింది. మనీలాండరింగ్ కేసులో జైన్‌తో ముడిపడి ఉన్న లావాదేవీల చార్ట్‌ను ఈడీ కోర్టుకు సమర్పించింది. అనంతరం జైన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను కోర్టు అక్టోబర్ 9కి వాయిదా వేసింది. ఆయన నాలుగు లింక్డ్ కంపెనీల ద్వారా మనీ లాండరింగ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2017లో జైన్‌పై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ కేసు టేకప్ చేసింది. ఇందులో భాగంగా ఆయనకు చెందిన రూ.4 కోట్ల 81 లక్షల విలువైన ఆస్తులను గతేడాది అటాచ్ చేసింది.

## నిరసనలకు ఓకే.. షరతులు వర్తిస్తాయి: సిద్ధరామయ్య

బెంగళూరు (ఎఎంఎస్) : తమిళనాడుకు కావేరి జలాల విడుదలపై రాష్ట్రంలో నిరసనలు తీవ్రమవుతుండటంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. నిరసనలను తమ ప్రభుత్వం అడ్డుకోదని, అయితే శాంతి భద్రతలను, ప్రశాంతను పాటించాలని కోరారు. కావేరీ జాలల వివాదంపై తదువరి విచారణ సుప్రీంకోర్టు మందుకు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కావేరీ అంశంపై నిరసనలు, బంద్‌లకు పిలుపు ఇస్తుండటంపై మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో నిరసనలను ప్రభుత్వాలు అడ్డుకోరాదని అన్నారు. ఈ అంశంపై బీజేపీ, జేడీఎస్ రాజకీయాలు చేస్తున్నాయని తప్పుపట్టారు. తమిళనాడుకు 5,000 క్యూసెక్కుల జలాలను విడుదల చేయాలంటూ కావేరీ వాటర్ మేనేజిమెంట్ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వుపై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు ఇటీవల నిరాకరించింది. వర్షాకాలంలో సరైన వర్షాలు పడక నీటి కొరత ఏర్పడిందని, ఆ కారణంగానే నీటిని విడుదల చేయలేకపోతున్నామని కర్ణాటక తన వాదన వినిపించింది. "కావేరి వాటర్ మేనేజిమెంట్ అథారిటీ అండ్ రెగ్యులేషన్ కమిటీ ఉత్తర్వులకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాం. ఇరు రాష్ట్రాల మధ్య భాగాల పరిష్కరానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. తమిళనాడు తొలుత 24,000 క్యూసెక్కులు, ఆ తర్వాత 7,200 క్యూసెక్కులు అడిగింది. జలాలు లేనందున 5,000 క్యూసెక్కులు కూడా ఇవ్వలేమని వారికి చెప్పాం" అని సిద్ధరామయ్య తెలిపారు. సెప్టెంబర్ 26న మళ్లీ కోర్టు ముందు విచారణ ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు కోర్టు ముందు ఉంచుతామని అన్నారు.

### నిరసనలు ప్రజాస్వామిక హక్కు: డీకే

ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ, నిరసనలు అనేవి ప్రజాస్వామిక హక్కు అని, అయితే ప్రజాజీవితానికి కష్టాలు కలిగించేలా నిరసలు ఉండరాదన్నారు. నిరసనలు, బంద్ పిలుపులు ఇచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, కోర్టు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకోవాలని, లేకుంటే చట్టపరమైన సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. సంక్లిష్ట పరిస్థితుల్లో కూడా రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

## ఎన్డీయేకు ఉద్వాసన చెప్పిన అన్నాడీఎంకే

చెన్నై (ఎఎంఎస్) : అన్నాడీఎంకే సంచలన నిర్ణయం తీసుకుంది. భారతీయ జనతా పార్టీతోనూ, జాతీయ ప్రజాస్వామ్య కూటమితోనూ పొత్తును తెగతెంపులు చేసుకున్నట్టు ప్రకటించింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని తమ పార్టీ ఏకగ్రీవంగా ఆమోదించినట్టు అన్నాడీఎంకే డిప్యూటీ కోఆర్డినేటర్ కేపీ మునుసామి ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వంతో తలెత్తిన సమస్యలను మునుసామి ప్రస్తావిస్తూ, అన్నాడీఎంకే మాజీ నేతలపైన, తమ ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ పైన, తమ పార్టీ కార్యకర్తలపైన ఏడాదిగా బీజేపీ అనుచిత వ్యాఖ్యలు చేస్తోందన్నారు.

అటు బీజేపీతోనూ, ఇటు ఎన్డీయేతోనూ అన్నిరకాల పొత్తులకు ఉద్వాసన చెప్పాలని అన్నాడీఎంకే నిర్ణయం తీసుకోవడానికి ఇదొక కారణమని చెప్పారు. పొత్తులకు ఉద్వాసన చెబుతూ అన్నాడీఎంకే ఏకగ్రీవంగా తీర్మానాన్ని సోమవారంనాడు ఆమోదించినట్టు తెలిపారు. తక్షణం ఈ నిర్ణయం అమల్లోకి వచ్చినట్టు చెప్పారు. కాగా, బీజేపీతోనూ, ఎన్డీయేతోనూ అన్నాడీఎంకే తెగతెంపులు చేసుకున్నట్టు ప్రకటించగానే ఆ పార్టీ కార్యకర్తలు చెన్నైలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

## మోదీ దగ్గర ఉన్న రిమోట్ నొక్కితే ఏం అవుతుందో తెలుసా?: రాహుల్ గాంధీ

రాయ్‌పుర్ (ఎఎంఎస్) : ఛత్తీస్ ఘడ్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీజేపీపై మండిపడ్డారు. అక్కడ ముఖ్యమంత్రి గ్రామీణ ఆవాస్ న్యాయ్ యోజనను రిమోట్ కంట్రోల్ ద్వారా ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన పబ్లిక్ మీటింగ్ లో రాహుల్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ దగ్గర ఓ రిమోట్ ఉందని దాన్ని సీక్రెట్ రిమోట్ అంటారని తెలిపారు.

ఆ రిమోట్ నొక్కితే బడా పారిశ్రామికవేత్త అదానీ కంపెనీ ముంబయి ఎయిర్ పోర్ట్ ని పొందుతుందని, పబ్లిక్ సెక్టార్ ప్రైవేటుపరం అవుతుందని ఆరోపించారు. అదానీకి బీజేపీ ప్రభుత్వం చేస్తున్న లబ్ధిపై తాను పార్లమెంటులో ప్రశ్నిస్తే ఏకంగా తన సభ్యత్వమే రద్దు చేపిస్తారని అన్నారు. మధ్యప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి మోదీ చేసిన వ్యాఖ్యలను రాహుల్ ఖండించారు. బీజేపీ కులగణన చేయడానికి వెనకాడుతోందని.. తాము అధికారంలోకి రాగానే కులగణన చేయిస్తామని ఆయన స్పష్టం చేశారు. త్వరలో 5 రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు.

## రూ.2 వేల నోట్లు ఇంకా మార్చుకోలేదా.. మిగిలింది 5 రోజులే.. ఆలస్యం చేస్తే అంతే..

న్యూఢిల్లీ (జిఎన్ఎస్) : ఆర్బీఐ గైడ్ లైన్స్ ప్రకారం.. ఈ నెల 30 దాటితే రూ.2 వేల నోటు భారత్‌లో చెల్లుబాటు కాదు. ఆ నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలని ఆర్బీఐ గతంలోనే గడువు విధించింది. ఈ గడువు సెప్టెంబర్ 30తో ముగుస్తుంది. ఇంకా ఎవరి దగ్గరైనా రూ.2 వేల నోటు ఉంటే వెంటనే బ్యాంకుకు వెళ్లి మార్చుకోవడం ఉత్తమం. నిజానికి ఈ నోటు మార్పిడి ప్రక్రియ మే 23న ప్రారంభమైందన్న విషయం తెలిసిందే.

### డిపాజిట్ ఇలా..

ఎలాంటి నిర్దిష్ట పరిమితి లేకుండా వ్యక్తులు తమ బ్యాంకులో రూ.2 వేల నోట్లను డిపాజిట్ చేసుకోవచ్చని ఆర్బీఐ పేర్కొంది. బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ లేదా జన్ ధన్ ఖాతా ఉపయోగిస్తున్న వారికి, సాధారణ డిపాజిట్ పరిమితులు అమలులో ఉంటాయి. ఖాతాలలో నిర్దిష్ట మొత్తానికి మించి నోట్లను డిపాజిట్ చేయాలనుకుంటే... కొన్ని పరిమితులకు కట్టుబడి ఉండాలి. ఇన్ కం ట్యాక్స్ నిబంధనల ప్రకారం.. వ్యక్తులు బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఒకే రోజులో రూ.50 వేల కంటే ఎక్కువ నగదు డిపాజిట్ చేసినప్పుడు వారి పాన్ కార్డు నంబర్‌ని తప్పనిసరిగా అందించాల్సి ఉంటుంది.

### ఆ రోజు సెలవు

సోమవారం నుంచి కేవలం 5 రోజుల వరకే నోట్లు మార్చుకునే ఛాన్స్ ఉంది. సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు బ్యాంకులు తెరిచి ఉంటాయి. 28వ తేదీన మిలాద్-ఉన్-నబీ పండగ ఉండటంతో బ్యాంకులకు ఆ రోజు సెలవు. మిగిలిన 29, 30 తేదీల్లో మాత్రమే బ్యాంకులు తెరిచి ఉంటాయని గమనించగలరు.

## బైజుస్ కంటెంట్‌లోనూ అవినీతి..త్వరలోనే బయటపెడతాం

అనంతపురం : స్కిల్ డెవలప్మెంట్ తరహాలోనే బైజుస్ కంటెంట్‌లో అవినీతి జరిగిందని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్య కుమార్ వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. బైజుస్‌లో జరిగిన అవినీతిపై ఆధారాలు సేకరిస్తున్నామని.. త్వరలోనే కేసులు పెడుతామని అన్నారు. రాష్ట్రంలో పరిస్థితులను ప్రజలు గమనిస్తున్నారన్నారు. పాలన గాలికి వదిలేసి... పరిస్థితులు అగమ్యగోచరంగా ఉందన్నారు. రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు జరుగుతున్నాయని విమర్శించారు. అభివృద్ధి విస్మరించి... అన్ని రంగాల్లో వైఫల్యం చెందారన్నారు. 15 రోజులుగా ఎమ్మెల్యేలు, మంత్రులు వెకిలి మాటలు, వికృత చేష్టలతో ప్రజల దృష్టి మరల్చుతున్నారన్నారు. సీఎం కక్ష్య సాధింపులపై పెడుతున్న దృష్టి... వ్యవసాయం, రైతాంగం సమస్యలపై దృష్టి పెట్టడం లేదన్నారు. ఏడు సార్లు కరెంట్ చార్జీలు పెంచారని... కరెంట్ కోతలు పెరిగాయని మండిపడ్డారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో నిత్యావసరాల ధరలు ఉన్నాయన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులానే... వైసీపీ ప్రభుత్వ బైజుస్ అవినీతి కూడా బయటకు వస్తుందని చెప్పారు. ఉత్తుత్తి బటన్లు నొక్కుతూ... జనాన్ని మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఒత్తిడి తట్టుకోలేక రాష్ట్రంలో ప్రతి రోజు పోలీసు ఆత్మహత్య చేసుకుంటున్నారని అన్నారు. మహిళ అని చూడకుండా పురందేశ్వరిని విమర్శించడం సరైంది కాదన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో వ్యవహరించిన తీరును బీజేపీ ఖండిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి అంశంలో రాష్ట్ర అంశాలపై జోక్యం చేసుకోదని స్పష్టం చేశారు. జగన్ బెయిల్ అంశం కేంద్రం ప్రభుత్వం పరిధిలోనిది కాదని... కోర్టు పరిధిలోని అంశమని చెప్పుకొచ్చారు. సీఎం జగన్‌ను అంతర్జాతీయ నేరగాడు చార్లెస్ శోభరాజుతో సత్యకుమార్ పోల్చారు.

### పొత్తులపై ఇప్పుడేమీ చెప్పలేం..

పొత్తుల అంశంపై బీజేపీ నేత మాట్లాడుతూ.. ఏపీలో పొత్తులపై ఇప్పుడేమీ చెప్పలేమని.. జనవరిలో ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉందని అన్నారు. రాష్ట్ర భవిష్యత్ అంధకారంలోకి నెట్టివేయబడిందన్నారు. కేవలం ప్రతిపక్షాలను అణచడానికి మాత్రమే అధికారాన్ని ఉపయోగిస్తున్నారన్నారు. ప్రభుత్వం 6 కోట్ల ఆంధ్రుల కోసం కాకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఉద్యోగస్తులకు జీతాలు లేవని, యువతకు ఉద్యోగాలు లేవని, ఇవన్నీ ప్రజల దృష్టి మరల్చి ఏమారిస్తున్నరని మండిపడ్డారు. ఈ ప్రభుత్వంలో ప్రతిదీ కుంభకోణమే అని ఆరోపించారు. తొడలు, మీసాలు మెలేయడం కోసమా అధికారం ఇచ్చిందని నిలదీశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబును అరెస్ట్ చేసి దేశమంతా తిరిగి ప్రెస్‌మీట్ పెడుతున్నారన్నారు. హత్యలు, ఆత్మహత్యలు, మహిళలపై అత్యాచారాలలో ఏపీ మొదటి స్థానంలో ఉందన్నారు. "ఆయన 10 ఏళ్ల నుంచి బయట తిరుగుతున్నారు.. మరి ఆయన కోర్టులను ఎలా మేనేజ్ చేస్తున్నాడో.. కోర్టులను మేనేజ్ చేయడం మేము కూడా మొదటి సారి చూస్తున్నాం. దేశంలో మేము ఇప్పటివరకు 10 ఏళ్లు బైయిల్ మీద బయట ఉండడం చూడలేదు.

## నేలపై కూర్చొని భోజనం చేయడం వల్ల లాభాలు ఎన్నో..!

మన పూర్వీకుల నుంచి పలు రకాల ఆచారాలు చాలామంది ఇప్పటికీ కూడా పాటిస్తూ ఉంటారు.. అలాంటి వాటిలో కుటుంబం అందరూ కలిసి నేల మీద కూర్చొని భోజనం చేసే ఒక పద్ధతి కూడా అప్పుడప్పుడు కనిపిస్తూ ఉంటుంది.కానీ ఈ మధ్యకాలంలో చాలామంది కుటుంబంతో కలిసి భోజనం చేయటం అరుదుగా ఉంటుంది.. నేల మీద కూర్చొని తినడం కూడా చాలా తగ్గిపోయింది. అయితే నేల మీద కూర్చొని తినడం వల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో ఇప్పుడు ఒకసారి మనం తెలుసుకుందాం.మనం నేల మీద కూర్చుని తినడం వల్ల చాలా సౌకర్యంగా అనిపిస్తుంది. దీనివల్ల పొట్ట చుట్టూ ఉండే కొవ్వు కండరాళ్లు నొప్పి ఏదైనా సరే వెంటనే తగ్గిపోతుందట. పొట్టపై ఒత్తిడి పడకుండా ఉంటుంది.నేల మీద కూర్చొని తినడం వల్ల మంచి శరీరాకృతి కనిపించడమే కాకుండా వివిధ రకాల శారీరక నొప్పులను కూడా తగ్గిస్తుందట. అందుచేతనే మన పూర్వీకులు సైతం ఎన్నో ఏళ్లు జీవిస్తూ ఉన్నారు. నేల మీద కూర్చొని తినడం వల్ల జీర్ణక్రియ చాలా సాఫీగా జరుగుతుంది. నేలమీద కూర్చొని తింటున్నప్పుడు వంగడం ,నమిలి మింగడం చేస్తూ ఉంటాము కనుక ఇందులో అవసరమైన ఆమ్లాలు శరీరంలోకి చాలా ఉత్పత్తి అవుతాయి. జీర్ణం బాగా కావడం చేత శరీరానికి కావాల్సినంత శక్తి కూడా అందుతుంది. నేల మీద కూర్చొని భోన్ చేయడం వల్ల అధిక బరువుతో ఇబ్బంది పడేవారు బరువు తగ్గవచ్చు.అయితే నేల మీద కాకుండా ఇతర చోట కూర్చొని తింటున్నట్లు అయితే ఫలితంగా ఎక్కువ తినడమే కాకుండా బరువు పెరిగేందుకు ఆస్కారం ఉందని నిపుణులు తెలుపుతున్నారు. నేలపై కూర్చొని తినేవాళ్లు కాళ్లు అడ్డంగా మడుచుకొని తింటున్నట్లు అయితే కండరాలు బలంగా మారడమే కాకుండా శరీరం చురుకుగా ఉంటుందట.దీంతో ఎముకలు కూడా బలహీనత లేకుండా ఉంటాయట. ఇలా ఇష్టమైన ఆహారాన్ని నేల మీద కూర్చొని తినడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయట.

## ఈ చిట్కాలు పాటిస్తే ఈజీగా బరువు తగ్గుతారు?

బరువు తగ్గాలనుకునే వారు ఖచ్చితంగా నీటిని ఎక్కువగా తీసుకోవాలి. వారి శరీరం ఎల్లప్పుడూ హైడ్రేటెడ్ గా ఉండేలా చూసుకోవాలి. నీటిని ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో వ్యర్థాలు ఈజీగా తొలగిపోతాయి.ఇంకా జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది. అవయవాల పనితీరు కూడా మెరుగుపడుతుంది. కాబట్టి ప్రతి రోజూ 10 నుండి 12 గ్లాసుల నీటిని తాగడం చాలా మంచిది. ఇంకా అలాగే ప్రతి రోజూ 7 నుండి 8 గంటల పాటు ఖచ్చితంగా నిద్రపోవాలి. తగినంత నిద్రలేకపోవడం వల్ల శరీరంలో హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలు ఎక్కువగా తలెత్తుతాయి. శరీరంలో జీవక్రియల రేటు కూడా తగ్గుతుంది. కాబట్టి ప్రతి రోజూ 8 గంటల పాటు నిద్రపోవడం చాలా మంచిది. ఇంకా అలాగే బరువు తగ్గాలనుకునే వారు చాలా మంది అల్పాహారాన్ని తీసుకోవడం కూడా మానేస్తూ ఉంటారు.కానీ ఇది అసలు మంచి పద్ధతి కాదు. ప్రతి రోజూ తప్పకుండా అల్పాహారంని తీసుకోవాలి.అల్పాహారంని తినడం వల్ల శరీరం సరైన పద్ధతిలో పయనిస్తుంది. ఇంకా అదే విధంగా ప్రతిరోజూ అరగంట పాటు వ్యాయామం చేయాలి. ఎందుకంటే వ్యాయామం చేయడం వల్ల శరీరంలో అధికంగా ఉండే కొవ్వు ఖర్చవుతుంది. హార్మోన్ల పనితీరు కూడా మెరుగుపడుతుంది. అలాగే జీవక్రియల రేటు పెరుగుతుంది. ఇక బరువు తగ్గాలనుకునే వారు ఉప్పును కూడా తక్కువగా తీసుకోవాలి. ఉప్పు ఎక్కువగా వున్న చిరుతిళ్లను, ప్యాకేజ్డ్ ఫుడ్ ను , సాస్ లను తీసుకోవడం తగ్గించాలి. అలాగే బరువు తగ్గాలనుకునే వారు నెమ్మదిగా భోజనం చేయాలి. స్పూన్ తో లేదా ఫోర్క్ తో లేదా చేత్తో తినేటప్పుడు కేవలం కొద్ది ఆహారాన్ని మాత్రమే తీసుకుని తినాలి.ఇంకా తినేటప్పుడు మధ్య మధ్యలో కొద్ది కొద్దిగా నీటిని తాగుతూ ఉండాలి. ఇలా చేయడం వల్ల ఆకలి తగ్గడంతో పాటు జీర్ణవ్యవస్థ కూడా చురుకుగా పని చేస్తుంది. ఇంకా అదే విధంగా బరువు తగ్గాలనుకునే వారు ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి.ఎందుకంటే ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల అది జీర్ణమవ్వడానికి సమయం ఎక్కువగా పడుతుంది.అందువల్ల మనకు త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది.ఈ విధంగా రోజూ ఈ నియమాలను పాటించడం వల్ల మనం చాలా ఈజీగా త్వరగా బరువు తగ్గవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## ట్రెడ్‌మిల్‌పై రన్నింగ్ చేస్తే కలిగే లాభాలు?

వాకింగ్ చేయడం అనేది నిజంగా చాలా సులభతరమైన ఎక్సర్‌సైజ్ అని చెప్పవచ్చు. ఏ వయస్సు వారైనా సరే ఎప్పుడైనా సరే ఈజీగా వాకింగ్ చేయవచ్చు. కానీ కొందరికి వాకింగ్ చేసేందుకు సరైన స్థలం కూడా ఉండదు. అలాగే ముఖ్యంగా వర్షాకాలంలో బయట వాకింగ్ చేయలేరు. ఇలా ఖచ్చితంగా కొన్ని ఇబ్బందులు కలుగుతుంటాయి. కానీ అలాంటివారు ట్రెడ్‌మిల్‌పై ఈజీగా వాకింగ్ చేయవచ్చు.ఇంకా అలాగే దీనిపై రన్నింగ్ కూడా చేయవచ్చు.మొదట్లో కష్టంగా ఉంటుంది కాబట్టి నెమ్మదిగా వాకింగ్ చేయాలి. అయితే కాస్త అలవాటు కాగానే ట్రెడ్‌మిల్‌పై రన్నింగ్ చేయాలి. ఇలా ప్రతి రోజూ కనీసం 15 నిమిషాల పాటు చేసినా చాలు చాలా ప్రయోజనాలను పొందవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రతి రోజూ ట్రెడ్ మిల్‌పై రన్నింగ్ చేయడం వల్ల ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.ప్రతి రోజూ ట్రెడ్‌మిల్ పై రన్నింగ్ చేయడం వల్ల గుండెకు చాలా మేలు జరుగుతుంది. ముఖ్యంగా శరీరంలో రక్త సరఫరా బాగా మెరుగు పడుతుంది. హైబీపీ కూడా తగ్గుతుంది. అలాగే రక్తనాళాల్లో ఉండే కొవ్వు కరుగుతుంది.అందువల్ల హార్ట్ ఎటాక్ రాకుండా ఉంటుంది.ఇంకా అలాగే గుండె పనితీరు మెరుగు పడుతుంది. ఎలాంటి గుండె జబ్బులు రావు. ఇంకా అలాగే ట్రెడ్ మిల్‌పై రన్నింగ్ చేయడం వల్ల శరీరంలోని కొవ్వు కూడా వేగంగా కరుగుతుంది.బరువు ఈజీగా తగ్గుతారు. బరువు తగ్గాలని చూస్తున్నవారు ట్రెడ్ మిల్‌పై ప్రతి రోజూ రన్నింగ్ చేయడం వల్ల చాలా మంచి ఫలితం ఉంటుంది.ట్రెడ్ మిల్‌పై రన్నింగ్ చేయడం వల్ల ఒత్తిడి, ఆందోళన నుంచి ఈజీగా ఉపశమనం లభిస్తుంది. అలాగే మానసిక ప్రశాంతత కలుగుతుంది. నిద్రలేమి నుంచి ఈజీగా బయట పడవచ్చు. నిద్ర కూడా చక్కగా పడుతుంది. ఇలా రన్నింగ్ చేయడం వల్ల ఆయుర్దాయం కూడా పెరుగుతుందని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల్లో వెల్లడైంది.ఇంకా అలాగే శరీర శక్తి సామర్థ్యాలు కూడా పెరుగుతాయి. రోజంతా చాలా యాక్టివ్‌గా ఉంటారు.

## వైవిధ్య భరితం వామనావతారం

"సంభవామి యుగే యుగే"... ధర్మ సంస్థాపనకోసం అవసరమైన సందర్భాల్లో అవతరిస్తూనే ఉంటా'నని శ్రీమహావిష్ణువు అభయ ప్రదానం చేశాడు. ఆ పరంపరలో ఆవిష్కారమైనది...వామనుడు లేదా త్రివిక్రముడు, హిందూ పురాణాల ప్రకారం శ్రీమహావిష్ణువు యొక్క దశావతారాలలో ఐదవ అవతారం. భాద్రపద శుద్ధ ద్వాదశి నాడు అదితి, కశ్యపుల కుమారుడిగా శ్రీహరి వామన మూర్తిగా అవతరించాడు. దీన్ని వామన ద్వాదశిగా, విజయ ద్వాదశిగా వ్యవహరిస్తారు. సృష్టిలోని జీవావరణంలో జీవులు సూక్ష్మ రూపం నుంచి మహా భారీకాయం వరకు వైవిధ్య భరితంగా గోచరమవుతాయి. ఈ అణుత్వం, మహారూపాలు పరస్పర విరుద్ధమైనవి. కానీ, ఆ వైవిధ్యం ఆత్మ, పరమాత్మల విషయంలో లేదని వేదోక్తి. ఆత్మ అణువు కంటే సూక్ష్మమైనది, మహత్తరమైనది.

అది ఎంత సూక్ష్మమైనదో, అంత స్థూల మైనదని కఠోపనిషత్తు ప్రకటించింది. వామనావతార నేపథ్యం ఇదే! దేవాసుర యుద్ధంలో ఇంద్రునితో ఓడి పోయిన బలి, రాక్షస గురువైన శుక్రాచార్యుల దయ వలన బ్రతికి, గురూపదేశంతో విశ్వజిత్‌యాగం చేసి బంగారు రథము, మహా శక్తివంతమైన ధనుస్సు, అక్షయ తూణీరములు, కవచము, శంఖములు పొందుతాడు. బలగర్వితుడై ఇంద్రుని మదమణి చేందుకు, రాక్షసుల నందరినీ ఒకచోటచేర్చి, యుద్ధమునకు సంసిద్ధం చేసి అమరావతిపై దండెత్తుతాడు. ఆ దుర్భర దానవ శంఖా విర్భూత ధ్వనులు నిండి, విభుదేంద్ర వధూగర్భములు పగిలి, లోపలి శిశువులు ఆవురని ఆక్రోశించుచుండ, దేవతలు బృహస్పతి వచనములు విని అమరావతి వీడి పారిపోయారు. దేవతల దుస్థితిని చూసి, సుర మాత అదితి, తన భర్తయైన కశ్యప బ్రహ్మను వేడుకున్నది. అంతట కశ్యపుడు అదితికి పయోభక్షణ వ్రతాన్ని ఉపదేశిస్తాడు. ఆమె ఫాల్గుణ మాసం, శుక్లపక్ష పాడ్యమి నుంచి 12 రోజులు హరి సమర్పణంగా వ్రతం చేసి భర్తను చేరగా, భగవ దంశతో, శ్రవణ ద్వాదశి (శ్రవణ నక్షత్రంతో కూడిన భాద్రపద బహుళ ద్వాదశిని శ్రవణ ద్వాదశి అంటారు), ఆనాడు శ్రోణ అభిజిత్ సంజ్ఞాత లగ్నంలో, రవి మధ్యాహ్నమున చరించు నప్పుడు, గ్రహ తారా చంద్ర భద్రస్థితిలో వామనుడు జన్మించాడు. వామనుడు పుట్టినప్పుడు శంఖ, చక్ర, గదా కమల కలిత, చతుర్భుజునిగా, బిశంగ వర్ణ వస్త్రాలతో, మకర కుండల మండిత గండ భాగుడై, శ్రీ విరాజిత లోలంబ, కదంబ వనమాలిగా నమస్త అలంకారాలతో, నిఖిల జన మనోహరుడిగా అవతరించాడు. రూపాంతరంబున తన దివ్య రూపాన్ని ఉపసంహరించుకొని, కపట వటుని వలె, ఉపనయ వయస్కుండై వామన బాలకుడయ్యాడు.

బృహస్పతి యజ్ఞోపవీతాన్ని ఇచ్చాడు. కశ్యప మహర్షి మొలత్రాడు ప్రసాదించాడు .తల్లి అదితి కౌపీనాన్ని , భూమాత నల్లజింక చర్మాన్నీ , చంద్రుడు దండాన్నీ , గగనాధిష్ట దేవత ఛత్రాన్నీ , బ్రహ్మ కమండలువునూ , సరస్వతి అక్షమాలికనూ (జపం చేసే సమయాన జప సంఖ్యను లెక్కపెట్టుకోవడానికి ), సప్తర్షులు పవిత్రలను ( కుశలను /దర్భలు ) వామన మూర్తికి బహూకరించారు. "ఇంతింతై...వటుడింతయై... అలా ధారా పరిగ్రహంబు చేసి, ఇంతితై వటుడింతయై, దానింతై, నభో వీధిపైనంతై, తోయద మండలాగ్రమున కల్లంతై, ప్రభారాశి పైనంతై, చంద్రునికంతయై, ధ్రువునిపైనంతై, మహర్వాటి పైనంతై, బ్రహ్మాండాంత సంవర్ధియై", సత్యపదోన్నతుడైన విష్ణువునకు అప్పుడే ఉదయించిన సూర్యబింబము మొదట గొడుగులా, తదుపరి శిరోరత్నమై, చెవి కుండలమై, మెడలోని ఆభరణమై, బంగారు కేయూరమై, కంకణమై వడ్డాణపు ఘంటమై, నూపుర ప్రవరమై, చివరకు పాదపీఠమై ఒప్ప అతడు బ్రహ్మాండము నిండినాడు – అని బమ్మెర పోతన భాగవతంలో పద్య రచన అద్భుతంగా చేశాడు. వారి జాక్షులందు, వైవాహికము లందు ప్రాణ విత్త మాన భంగమందు/ జకిత గోకులాగ్ర జన్మరక్షణ యందు/బొంక వచ్చు.....తప్పు లేదు./ అది పాపము కాదు. అని శుక్రాచార్యుడు వివరించెను. దానికి బలి చక్రవర్తి ..కారే రాజులు రాజ్యముల్ కలుగవే, గర్వోన్నతిం బొందరే వారేరీ? సిరి మూట గట్టుకొని పోవంజాలిరే? భూమిపై పేరైనంగలదే! శిబి లాంటి దాతల పేరు ఈనాటికీ స్థిరములైనవి కదా! భార్గవా! అని పలుకుతూ తన మాటను తోసి పుచ్చిన రాజును పదభ్రష్టునివి గమ్మని శుక్రాచార్యుడు శపించాడు. అయినను బలిచక్రవర్తి హరి చరణములు కడిగి, "త్రిపాద ధరిణిం దాస్యామి" అనుచు నీటిధార విడిచాడు. ఆ కలశములో సూక్ష్మకీటక రూపమున చేరి శుక్రాచార్యుడు నీటిధారను ఆప బోయాడు. అప్పుడు హరి కుశాగ్రముతో కలశ రంధ్రమును బొడువగా కన్ను పోగొట్టుకొని శుక్రాచార్యుడు ఏక నేత్రుడయ్యెను.

"పుట్టి నేర్చుకునెనో, పుట్టక నేర్చెనో.. ఈ పొట్టి వడుగునకీ చిట్టి బుద్ధులెట్లబ్బెనో, ఈతని పొట్టనిండా అన్నీ భూములే.. అని నవ్వుతూ మూడడుగుల నేలను బలి వడుగుకు దానమిచ్చెను. ఒక పాదంబులో భూమిని కప్పి, దేవ లోకమును రెండవ పాదమున నిరోధించి, జగములెల్ల దాటి చనిన త్రివిక్రముడు మరల వామనుడై బలి నవలోకించి నా మూడవ పాదమునకు స్థలము జూపమన్నాడు. అప్పుడు బలి వినయముతో నీ తృతీయ పాదమును నా శిరమున ఉంచమని వేడుకొనగా సమ్మతించిన హరి బలిని ఆశీర్వదించి, ప్రహ్లాదునితో సుతల లోకమునకు పంపి, తానే ఆలోకమునకు ద్వారపాలకు డాయెను. బలి నడిగి సంపాదించిన లోకములను తన సోదరుడైన ఇంద్రున కిచ్చి సంతోషపరిచాడు శ్రీహరి. "ఛలయసి విక్రమణే బలి మద్భుత వామన పదనఖ నీరజ నతజన పావన కేశవ ధృత వామన రూప జయ జగదీశహరే" ఽ జయదేవుని దశావతార స్తోత్రము ఈ వామనా వతార గాథను విన్న వారు, చదివిన వారు సకల శుభాలను పొందుతారు. దైవారాధన సమయంలో ఎవరైతే త్రివిక్రమ పరాక్రమాన్ని స్మరించు కుంటారో వారికి నిత్య సౌఖ్యాలు కలుగు.తాయని ప్రతీతి. వామన కంచిలో అద్భుతమైన వామన అవతారం గుడి ఉంది.

## జామ పండే కాదు ఆకులు కూడా దివ్యౌషధమే..!

జామపండు అనేది మార్కెట్‌లో సులభంగా లభించే పండు. ఇది ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా పరిగణించబడుతుంది. కానీ మీకు తెలుసా..?జామ ఆకులు కూడా ఆరోగ్యానికి దివ్యౌషధం లాగా పని చేస్తాయి. మీరు కడుపు సంబంధిత సమస్యలను వదిలించుకోవాలనుకుంటే, జామ ఆకులు తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. దీని వినియోగం అనేక ఆరోగ్య సంబంధిత సమస్యల నుండి కూడా ఉపశమనం కలిగిస్తుంది.జామ ఆకులను ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల మరింత మేలు జరుగుతుంది. ఉదయం నిద్రలేచిన వెంటనే ఖాళీ కడుపుతో జామ ఆకులను నమలడం ద్వారా అనేక వ్యాధుల నుండి ఉపశమనం పొందవచ్చు. కాబట్టి ఖాళీ కడుపుతో జామ ఆకులను నమలడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఉదయాన్నే ఖాళీ కడుపుతో జామ ఆకులను నమలడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది అజీర్ణం, మలబద్ధకం, గ్యాస్, ఎసిడిటీ వంటి పొట్ట సమస్యలు వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది. అందుచేత ప్రతి రోజూ ఉదయాన్నే జామ ఆకులను నమలాలి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో జామ ఆకులను నమలడం వల్ల పొట్టతో పాటు బరువు కూడా తగ్గుతుంది. ఇటువంటి అనేక సమ్మేళనాలు ఇందులో కనిపిస్తాయి. ఇవి శరీరంలో కార్బోహైడ్రేట్ల శోషణను నిరోధిస్తాయి. దీని కారణంగా బరువు నియంత్రణలో ఉంటుంది. విటమిన్ సి జామ ఆకులలో లభిస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. అనేక వ్యాధులను నివారిస్తుంది. రోజూ జామ ఆకులను తీసుకోవడం వల్ల మధుమేహం కూడా అదుపులో ఉంటుంది. ఇందులో ఉండే ఫినాలిక్ రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుతుంది. తద్వారా మధుమేహాన్ని నివారిస్తుంది.జామ ఆకులను రోజూ తీసుకోవడం వల్ల బీపీ కూడా అదుపులో ఉంటుంది. జామ లాగానే దీని ఆకుల్లో కూడా పొటాషియం, ఫైబర్ ఉంటాయి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచుతాయి.జామ ఆకులు కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో కూడా సహాయపడతాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించి మంచి కొలెస్ట్రాల్‌ను నియంత్రించే సామర్థ్యం దీనికి ఉంది.

## పచ్చిమిర్చి ఎక్కువ తింటే కలిగే నష్టాలు?

మనం నిత్యం ఆహారంగా తీసుకునే వంటకాల్లో ఖచ్చితంగా పచ్చిమిర్చి కూడా ఒకటి. పచ్చిమిర్చిని మనం చాలా రకాలుగా వాడుతూ ఉంటాము. ఇక వంటల్లో పచ్చిమిర్చిని వేయడం వల్ల వంటలకు ప్రత్యేకమైన రుచి వస్తుంది.ఇంకా పచ్చిమిర్చిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి కూడా చాలా మేలు కలుగుతుంది.ఇందులో మన ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలు ఉంటాయి. వంటలకు రుచిని ఇవ్వడంతో పాటు పచ్చిమిర్చిని తీసుకోవడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు. అయితే ఈ పచ్చిమిర్చిని మన తగిన మోతాదులో మాత్రమే తీసుకోవాలి.ఇది మన ఆరోగ్యానికి మేలు చేసినప్పటికి వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల మనం చాలా రకాల అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.అయితే ఈ పచ్చిమిర్చిని ఎక్కువగా తీసుకోవడం వల్ల మనకు కలిగే దుష్ప్రభావాల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం. ఈ పచ్చిమిరపకాయలల్లో క్యాప్సైసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఈ సమ్మేళనం కారణంగా ప్రేగుల్లలో ఖచ్చితంగా నొప్పి వచ్చే అవకాశం ఉంది. ఇంకా పచ్చిమిర్చిని ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. పొట్టలో ఫోలిక్ యాసిడ్ స్థాయిలు కూడా పెరుగుతాయి. ఇంకా అంతేకాకుండా పచ్చిమిర్చిని ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో వేడి పెరుగుతుంది. అలాగే నిద్రలేమి సమస్య తలెత్తుతుంది. ఇంకా మానసికపరమైన సమస్యలు తలెత్తుతాయి.అలాగే ఒత్తిడి, ఆందోళన వంటివి మరింతగా పెరుగుతాయి.ఈ పచ్చిమిర్చిని అధిక మొత్తంలో తీసుకోవడం వల్ల కడుపులో ఎసిడిటీ సమస్య కూడా పెరుగుతుంది.అలాగే కడుపులో పుండ్లు వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇంకా అలాగే విరోచనాల సమస్య బారిన పడే అవకాశం కూడా ఉంది. అలాగే టిబి సమస్యతో బాధపడే వారు పచ్చిమిర్చికి ఖచ్చితంగా చాలా దూరంగా ఉండాలి.ఎందుకంటే పచ్చిమిర్చి టిబి సమస్యను మరింత అధికం చేసే గుణాలను కలిగి ఉంటుంది. ఇది మన ఆరోగ్యానికి పచ్చిమిర్చి మేలు చేసేదే అయినప్పటికి దీనిని అధికంగా తీసుకోవడం వల్ల మనం వివిధ అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉంది. కాబట్టి పచ్చిమిర్చిని మనం వంటలల్లో కూడా తగిన మోతాదులో వాడాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## ప్లేట్ లెట్లను ఈజీగా పెంచుకునే టిప్స్?

ఈ సీజన్లో చాలా మంది కూడా జ్వరాల బారిన పడుతున్నారు. ఈ జ్వరాలు కాస్తా డెంగీగా మారుతున్నాయి. అయితే కొంత మందిలో తగిన చికిత్స తీసుకోగానే అవి తగ్గిపోతున్నాయి.అయితే మరికొంత మందిలో మాత్రం చాలా తీవ్రంగా పరిణమిస్తుంది.రక్త స్రావం, రక్తం చిక్కబడటం, ప్లేట్ లెట్ల పడిపోవడం వంటివి ఎక్కువగా కనిపిస్తాయి. డెంగీ జ్వరం వస్తే.. ఒళ్లంతా నొప్పులు, తీవ్రంగా జ్వరం, వణికిపోడం ఇంకా వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. డెంగీ జ్వరం వచ్చిన వారిలో ఎక్కువగా ప్లేట్ లెట్ల ఎక్కువగా పడిపోతూంటాయి. ప్లేట్ లెట్ల పడిపోవడం అంటే ఖచ్చితంగా ప్రాణం మీదకి వచ్చినట్టే. అయితే ప్లేట్ లెట్ల సంఖ్య పెంచడానికి కొన్ని రకాల ఆకులు చాలా బాగా పని చేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అవి ఏంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం.ఇక రక్తంలో ప్లేట్ లెట్ల సంఖ్య పెంచడానికి బొప్పాయి ఆకులు చాలా బాగా హెల్ప్ చేస్తాయి. వీటి రసం కానీ, కషాయం కానీ తాగితే ప్లేట్ లెట్ల కౌంట్ వెంటనే పెరుగుతుందని పలు అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. వీటి రసం తాగడం వల్ల ప్లేట్ లెట్ల సంఖ్య పెరగడమే కాకుండా జ్వరం కూడా ఈజీగా తగ్గుతుంది. అలాగే వేప ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ ఇంకా యాంటీ వైరల్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. కాబట్టి వేప ఆకుల్ని తీసుకోవడం వల్ల ప్లేట్ లెట్ల కౌంట్ అనేది ఈజీగా తగ్గుతుంది. వేపాకుల్ని తీసుకొని వాటిని నీటిలో మరిగించి.. ఆ నీటిని తాగడం వల్ల.. ప్లేట్ లేట్ల సంఖ్య పెరగడంతో పాటు రోగ నిరోధక శక్తి కూడా ఈజీగా పెరుగుతుంది.అలాగే జామ ఆకుల్లో కూడా యాంటీ ఇన్ ఫ్లమేటరీ, యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ ఇంకా యాంటి ఆక్సిడెంట్లు అనేవి పుష్కలంగా ఉంటాయి. కాబట్టి జామ ఆకుల్ని తీసుకున్నా ప్లేట్ లెట్లను ఈజీగా పెంచుకోవచ్చు. రెండు గ్లాసుల నీటిలో.. జామ ఆకులు వేసి సగం అయ్యే దాకా మరిగించుకోవాలి.ఇక ఇవి గోరు వెచ్చగా ఉన్నప్పుడు తేనె కలుపుకుని తాగిలి. ఇలా రోజుకు మూడు సార్లు తాగితే.. ప్లేట్ లెట్లను ఈజీగా పెంచుకోవచ్చు. ఇంకా అలాగే డెంగీని కూడా తగ్గించుకోవచ్చు.

## ప్రజా ప్రతినిధులు గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### కమిషనర్ కీర్తి చేకూరి ఐపిఎస్

గుంటూరు సెప్టెంబరు 29 (ఎఎంఎస్) : నగరంలోని కార్పొరేటర్ల నుండి అందే అర్జీలు, ఫిర్యాదుల పరిష్కారంపై వార్డుల వారీగా నివేదిక ఇవ్వాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ చాంబర్లో నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లోని అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులు గుర్తించిన ప్రజల సమస్యలను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు వార్డ్ ల వారిగా కార్పొరేటర్లు అందించిన అర్జీలు వాటి పరిష్కారం పై నివేదిక ఇవ్వాలని ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యల పరిష్కారం, నగర సమగ్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం స్పందన ప్రతిరోజు వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం మూడు నుండి ఐదు గంటల వరకు ప్రజాస్పందన నిర్వహిస్తున్నామన్నారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్ లు ప్రతి శుక్రవారం కమిషనర్ తో చర్చించవచ్చున్నారు. మిగిలిన రోజుల్లో కూడా కార్పొరేటర్లకు అందుబాటులో ఉంటామని వాట్స్ అప్ లో సమస్యలు తెలిపిన కూడా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్పొరేటర్ల నుండి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనలను క్రమ పద్ధతిలో రికార్డు చేసి తదుపరి చర్యలు కూడా వారికి తెలిపేలా అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు.

## వాహన మిత్ర పథకాన్ని కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం

బాపట్ల (ఎఎంఎస్) : వై.ఎస్.ఆర్.వాహన మిత్ర పథకం కింద ఆటో, ట్యాక్సీ, మాక్సి క్యాబ్, డి ఎం యు వాహన యజమానులు, డ్రైవర్లకు ఆర్థిక సహాయం నగదు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ.వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి. జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ఎపి శాసనమండలి చీఫ్ విప్ ఉమారెడ్డి వెంకటేశ్వర్లు,



జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ చామకూరి శ్రీధర్, శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత.

## వీడుకోలు - ఆత్మీయ సన్మాన సభ

బాపట్ల (ఎఎంఎస్) : స్థానిక అడిషనల్ డిస్ట్రిక్ జడ్జ్ కోర్ట్ హాల్లో బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు భీమా లీలా కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం బాపట్ల 6వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్ట్ హాల్లో న్యాయమూర్తులకు ఘనంగా వీడ్కోలు సభ, ఆహ్వాన సభ జరిగినది 6వ అడిషనల్ డిస్ట్రిక్ జడ్జిగా పనిచేసిన కె. సీతారామ కృష్ణారావు వీడ్కోలు సభ, పదోన్నతి పై నెల్లూరు నుంచి బాపట్ల కు 6వ అడిషనల్ డిస్ట్రిక్ జడ్జిగా వచ్చినటువంటి కె.పి. బాలాజీ ఆత్మీయ సన్మాన సభ జరిగినది. కె. సీతారామ కృష్ణారావు మాట్లాడుతూ తను పనిచేసినది కొద్ది కాలమే అయినా బార్ సభ్యులు తనతో ఎంతో సహకరించారు అని వారు అందరికీ ధన్యవాదములు తెలిపినారు. అదేవిధంగా కె.పి. బాలాజీ మాట్లాడుతూ తనకు కూడా అంతే సహాయ సహకారములు అందించాలని సభ్యులందరినీ కోరారు. ఈ సభలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ జి.వాణి , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ జి. రుక్మిణి, ఏపీపీ. శ్రీకాంత్, మహేంద్ర, న్యాయవాదులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా వినాయకుని ఉత్సవం

బాపట్ల (ఎఎంఎస్): వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొండగట్టు వారి పాలెం జై ప్రకాష్ నగర్ లో వినాయకుని ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. బాపట్ల మండలం జయప్రకాష్ నగర్ కొండగట్టు వారి పాలెం వెంకటేశ్వర స్వామి గుడిలో ఏర్పాటు చేసి ఉన్న వినాయకుని మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించా కొండగట్టు వారి పాలెంలో విచ్చేసి ఉన్న శ్రీ అలివేలుమంగా పద్మావతి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఏర్పాటు చేసి ఉన్న వినాయకుని విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు సుమారు రెండువేలమంది దాకా భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు తనంతరం లడ్డు పాట కార్యక్రమం జరగగా. పతికకేజీల మహా ప్రసాదమైనటువంటి స్వామివారి లడ్డు పాట భక్తుల సమక్షంలో జరగక అచ్చిపోలు గాంధీ గారు అక్షరాల నలాపై ఐదువేల నుటపదహారు రూపాయలకు లడ్డును కైవసం చేసుకున్నారు వినాయకుని ఉత్సవ కమిటీ మాట్లాడుతూ భక్తుల సహకారంతో అంగరంగ వైభవంగా ఎంతో కన్నులు విందుగా ఈ కార్యక్రమం జరగటం మా అందరికీ ఎంతో సంతోషకరంగా ఉందని తెలిపారు.

## చదువులలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన బాపట్ల జిల్లా పోలీస్ సిబ్బంది పిల్లలకు "మెరిట్ స్కాలర్ షిప్" లను అందజేసిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

- చదువులలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలి: ఎస్పీ
- జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా పోలీస్ శాఖ అమలుపరుస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎస్పీ

బాపట్ల (ఎఎంఎస్): చదువులలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ విద్యార్థులకు సూచించారు. గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డి.జి.పి కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి ఐపీఎస్ ఉత్తర్వులు మేరకు జిల్లా ఎస్పీ సెప్టెంబర్ 29 శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పదవ తరగతి, ఇంటర్, ఎంటెక్, డిగ్రీ, పీజీ, ఎంబీబీఎస్ లలో మంచి మార్కులు సాధించిన 31 మంది పోలీసు సిబ్బంది పిల్లలకు మొత్తం రూ.5,56,000/- "మెరిట్ స్కాలర్ షిప్'' ను పోలీసు సంక్షేమ నిధి నుండీ మంజూరు చేసి వాటిని అందజేసినారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ "మెరిట్ స్కాలర్ షిప్" లను పొందిన పోలీస్ పిల్లలు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమై విద్యార్థుల వివరాలు, వారు ప్రస్తుతం చదువుతున్న కోర్స్ ల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని/విద్యార్థులు వారి లక్ష్యాలను చేరుకోవడానికి ఏవిధంగా సన్నద్ధం అవ్వాలి అను విషయాలను విపులంగా వివరించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పోలీసు సంక్షేమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ కార్యాలయం నుండి ప్రతి జిల్లాలోని పోలీస్ సిబ్బంది పిల్లలకు "మెరిట్ స్కాలర్ షిప్" మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా బాపట్ల జిల్లాలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది పిల్లలలో 2021-22 సంవత్సరంలో చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 31 మందికి "మెరిట్ స్కాలర్ షిప్" గా మొత్తం రూ.5,56,000/- మంజూరు చేయడం జరిగిందన్నారు. గతంలో ఈ నగదును చెక్కుల రూపంలో అందజేసే వారిమని, ప్రస్తుతం నేరుగా వారి బ్యాంక్ ఖాతాలలోనే జమ చేయడం జరుగుతుందన్నారు. పోలీసు పిల్లలు చక్కగా చదివి మంచి మార్కులు సాధించి ప్రతిభ పురస్కారాలు అందుకోవడం ప్రశంసనీయమన్నారు. ఈ స్ఫూర్తితో మున్ముందు రెట్టింపు కృషితో చదువులలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. విద్యార్థులు వారు ఎంచుకున్న మార్గంలో ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పని సరిగా ఉండాలన్నారు. అప్పుడే వారు నిర్దేశించుకున్న లక్ష్యాలను సునాయాసంగా చేరుకోగలరన్నారు. ప్రతి సంవత్సరం జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా పోలీస్ శాఖ అమలు పరుస్తున్న కార్యక్రమాలను పోలీస్ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్ , వెల్ఫేయిర్ ఆర్.ఐ బి.శ్రీకాంత్ నాయక్, బి - సెక్షన్ సూపరింటెండెంట్ కె.రాధా, పోలీసు సిబ్బంది పిల్లలు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి లక్ష్యంగా అడుగులు వేస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి

బాపట్ల (ఎఎంఎస్) : కులం, మతం, తారతమ్యాలు లేకుండా సమానంగా అర్హులందరకి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ఎపి శాసనమండలి చీఫ్ విప్ ఉమారెడ్డి వెంకటేశ్వర్లు చెప్పారు. వై.ఎస్.ఆర్.వాహన మిత్ర పథకం కింద ఆటో, ట్యాక్సీ, మాక్సి క్యాబ్, డి ఎం యు వాహన యజమానులు, డ్రైవర్లకు ఆర్థిక సహాయం నగదు పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ.వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఎన్.టి.ఆర్ జిల్లాలో ప్రారంభించారు.

## ఒక్కసారైనా రక్తదానం చేసి రక్తబంధువు లవ్వండి : జిల్లా ఛైర్మన్ నారాయణ భట్టు

బాపట్ల (ఎఎంఎస్) : రక్తదాతకాని వారు రక్తం కోరే హక్కు కోల్పోతారు. ఒక్క సారైనా రక్తదానం చేసి రక్తబంధువు లవ్వండి అని జిల్లా ఛైర్మన్ నారాయణ భట్టు పిలుపిచ్చారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం నందు గ్రామీణ సెక్రటరీ లకు జరుగుతున్న పాలనా శిక్షణ కార్యక్రమం నాకు ముఖ్య అతిథిగా భట్టు పాల్గొని గ్రామీణ వనరుల సమీకరణ విపత్తుల సమయంలో క్షేత్ర స్థాయిలో సహాయ పడుతుందని, దానికి గ్రామీణ యువదళాలు రక్తదాతలుగా, పర్యావరణ పరిరక్షకులుగా, శిక్షణ ఇచ్చి సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రతి వ్యక్తి సంవత్సరాని వకసారైనా రక్తదానము చేయాలని, రెడ్ క్రాస్ జీవిత సభ్యులుగా చేరటంద్వారా మానవతా విలువలు పెంచాలని పిలుపునిచ్చారు. శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కె. శ్రీ నివాసరెడ్డి, ముఖ్య అతిథిగా శిక్షకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త సంచాలకులు శ్రీ వై.థోసి రెడ్డి పాల్గన్న శిబిరం లో 200 పైగా విలేజ్ సెక్రటరీ లు శిక్షణ పొందారు.

## యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించాలన్న ఆలోచన చేయడమే తప్పా

### బాపట్ల నియోజకవర్గ రెడ్డి సామాజికవర్గం

బాపట్ల(ఎఎంఎస్) : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకి నిరసనగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జ్ వేగేశన నరేంద్ర వర్మ ఆదేశాలమేరకు బాబు తోడుగా ఒక నియంత పై పోరాటం కోసం మేము సైతం అని బాపట్ల నియోజకవర్గ రెడ్డి సామాజికవర్గం రిలే నిరాహార దీక్ష లో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జగన్ జైల్లో ఉన్నాడు కాబట్టి తెలుగుదేశం పార్టీ వారు కూడా జైల్లో ఉండాలన్న తీరులో పాలన సాగిస్తున్నారని ఆరోపించారు.

యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించాలన్న ఆలోచన చేయడమే తప్పా అని ఆయన ప్రశ్నించారు? చంద్రబాబును అరెస్ట్ చేసి తాత్కాలికంగా ఇబ్బంది పెట్టవచ్చు కానీ అంతిమంగా ఆయన నిజాయితీగా బయటికి కడిగిన ముత్యంలా వస్తారని అన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా తెలుగుదేశం పార్టీ భయపడదని, ఇటువంటి ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని నిలబడిన పార్టీ టీడీపీ అని అన్నారు.

సాయంత్రం బాపట్ల నియోజకవర్గ రెడ్డి సామాజికవర్గం నాయకులకు, కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ నాయకులు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమించారు. అనంతరం బాబు తో నేను బోర్డు మీద మద్దతుగా బాపట్ల నియోజకవర్గ రెడ్డి సామాజికవర్గం నాయకులు సంతకాలు పెట్టారు. ఈ కార్యక్రమం లో రెడ్డి సామాజికవర్గం నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం : సీఎం జగన్

బాపట్ల (ఎఎంఎస్) : వైద్యం కొరకు పేదలెవరూ అప్పుల బారిన పడకుండా ఉచితంగా వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ.వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం తాడేపల్లిలోని రాష్ట్ర ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించారు.

## బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ వారికి అభినందన సత్కారం

బాపట్ల (ఎఎంఎస్) : బాపట్ల జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లోక్పాల్ జిందాల్ జాతీయ పురస్కారాలందుకున్న సందర్భంగా బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ వారికి అభినందన సత్కారం అందించటం జరిగింది. నాటుసారా, గంజాయి మత్తు పదార్థాల పై ఆపరేషన్ పరివర్తన కార్యక్రమం చేపట్టి 83 కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు అందించటమేకాక, విద్యార్థులకు ఫైట్ యగైనెస్ట్ డ్రగ్స్ జాగృతి వి 51 కళాశాలల లో సదస్సులు నిర్వహించి సామాజిక చైతన్యాన్ని కలిగించడానికి జిందాల్ కృషికి జాతీయ స్థాయిలో రెండు స్కాచ్ పురస్కారాలందుకోవటం బాపట్ల జిల్లా కు గర్వకారణం అని ఛైర్మన్ నారాయణ భట్టు అన్నారు. అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మహేష్ ను జ్ఞాపికతో సత్కరించారు.

## పేద పిల్లలకు విద్యను అందించడమే ధ్యేయం

మాచర్ల, సెప్టెంబర్ 29(ఎఎంఎస్): పేద పిల్లలకు విద్యను అందించడమే ప్రధాన ధ్యేయమని దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్, బీసీ సంఘం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కొరదల జ్యోతి అన్నారు. మాచర్ల పట్టణంలోని పార్క్ సెంటర్ వద్ద శుక్రవారం పేద పిల్లలను గుర్తించి, పేర్లు నమోదు చేసుకొని పాఠశాలకు పంపేందుకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, కమిషనర్ ఈవి రమణబాబుల ఆదేశాల మేరకు స్వామి వివేకానంద ట్రస్ట్ వ్యవస్థాపకులు మెట్టు గోవిందారెడ్డి ఆధార్ కార్డు లేని పాఠశాలకు వెళ్ళని పేద పిల్లలను గుర్తించి ఆధార్ కార్డులో పేర్ల నమోదు ప్రక్రియ చేపట్టడం గమనార్హమన్నారు. తద్వారా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఆధార్ కార్డులో పేర్లు నమోదు చేయించి బడిలో చేర్పించడానికి బృహత్తర కార్యక్రమం చేపట్టడం హర్షనీయమన్నారు. పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కృషి చేసిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్లకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## కౌన్సిల్ సమావేశంలో 5 అంశాలు ఆమోదం : మున్సిపల్ చైర్మన్ చిన్న ఏసోబు

మాచర్ల, సెప్టెంబర్ 29 (ఎఎంఎస్) : మాచర్ల పురపాలకసంఘ కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కౌన్సిల్ సమావేశంలో ఐదు అంశాలకు ఆమోదం తెలిపారు. సభ్యులందరూ ఐదు అంశాలను ఆమోదిస్తున్నట్లు తెలిపారు. అలాగే కౌన్సిలర్ షేక్. సుభాని సాహెబ్ పట్టణంలో దోమల సమస్య, పారిశుద్ధ్య సమస్య ఉన్నట్లు చైర్మన్ ఏసోబు, కమిషనర్ రమణబాబు దృష్టికి తీసుకువచ్చారు. సమస్యపై స్పందించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్లు ప్రభుత్వవిప్, శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి తక్షణమే కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో పలువురు అధికారులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు ఉన్నారు.

## మెగా జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా హాజరైన డా॥ మేరుగ నాగార్జున

బాపట్ల (ఎఎంఎస్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, మరియు సీడాప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, వేమూరు నందు జరిగిన మెగా జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు డా.మేరుగ నాగార్జున హాజరయ్యారు ఈ జాబ్ మేళా కు 18 కంపెనీలు హెటిరో డ్రగ్స్, అపెక్స్ సొల్యూషన్స్, మాల్టెక్ సొల్యూషన్స్, ఐ.సి. ఐ.సి. ఐ, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, అమర్ రాజ ఇండస్ట్రీస్ వంటి పలు కంపెనీలకు 10వ తరగతి నుండి పి.జి చదివిన 504మంది అభ్యర్థులు హాజరు కాగా 152 మంది వివిధ కంపెనీలకు ఎంపిక కాబడినారు ఎంపిక కాబడిన వారి జీతం 10,000/- నుండి 40,000/- వరకు ఉంటుందని అని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఈ.తమ్మాజీరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ శాసనసభ సభ్యుడు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం గతంలో కంటే మెరుగైన సేవలు అందించటానికి స్కిల్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ విస్తరించటం కాకుండా యువతకు మెరుగైన ఉపాధి కల్పించటానికి జాబ్ మేళాలు భవిష్యత్తులో ఇంకా నిర్వహిస్తారని. శిక్షణా కార్యక్రమాలు చేపట్టడానికి స్కిల్ హబ్, స్కిల్ కళాశాల, స్కిల్ యూనివర్సిటీ వంటి ద్వారా శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నారు. నిరుద్యోగ యువతకు ఇది సువర్ణ అవకాశమని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎంపిక కాని వారికి 3 నెలలు వేమూరు నియోజక వర్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా డొమెస్టిక్ డేటా ఎంట్రీ, జూనియర్ సాఫ్ట్ వేర్ డెవలపర్, టైలరింగ్ వంటి శిక్షణా కార్యక్రమాలకు తర్ఫీదు ఇచ్చి ఉపాధి కల్పిస్తారని తెలిపారు. జాబ్ మేళా అనంతరం సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేరుగ నాగార్జున చేతుల మీదగా ఎంపిక కాబడిన అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందచేయటం జరిగింది. ఈ జాబ్ మేళాకు జిల్లా ఉపాధి కల్పనాధికారి విష్ణు మూర్తి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీ రావు, నైపుణ్యాభివృద్ధి ప్రత్యేక అధికారి ఎ.శివ నాగరాజు , యంగ్ ప్రొఫెషనల్ ఈ. హారికా సౌగంది, మాజీ ఎం.పి.పి బొల్లిశెట్టి ప్రభాకర్, సర్పంచ్ సజ్జా లక్ష్మి శ్రీనివాస్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ వై.ఎస్.ఆర్.సి.పి నాయకులు బొల్లిముంత ఏడుకొండలు, వై.ఎస్.ఆర్.సి.పి నాయకులు కోగంటి లవ కుమార్, దున్న మేరీస్ బాబు, సీడాప్ సిబ్బంది, స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : కమిషనర్ కీర్తి చేకూరి ఐఏఎస్

గుంటూరు సెప్టెంబర్ 29(ఎఎంఎస్) : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికి ఆరోగ్య భరోసా లభిస్తుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. శుక్రవారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో ఈ నెల 30 నుండి నగరంలో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ఏర్పాటుపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, నగరపాలక సంస్థ అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఈనెల 30 నుండి నవంబర్ 15 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఇందులో భాగంగా నగరంలోని 29 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు జరుగుతాయని అందుకు అవసరమైన మౌలిక వసతులు, మెడికల్ సిబ్బంది ఏర్పాట్ల పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రతి వార్డు సచివాలయ కార్యదర్శి క్యాంపులో భాగస్వాములు అయ్యేలా చూడాలని నోడల్ అధికారులను ఆదేశించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి పరీక్షల నివేదిక అవసరమైన మందుల కిట్ అందించాలన్నారు. నగరంలో 45 రోజులపాటు జగనన్న సురక్ష క్యాంపులు జరుగుతాయని ఇప్పటికే ఏఎన్ఎం, ఆశ, వాలంటీర్లు ప్రజల ఇళ్ల వద్దకు వచ్చి ఆరోగ్య సర్వే చేశారని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు సంబంధిత అర్బన్ హెల్త్ సెంటర్ లోని క్యాంపు కి హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి శిబిరంలో జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్ తో పాటు ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకొని అవసరమైతే అందుబాటులోని వైద్యశాలలో చేర్చి చికిత్స అందిస్తారని ఆరోగ్యశ్రీ ద్వారా కూడా ఉచితంగా శాస్త్ర చికిత్సలు చేస్తారని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కోరారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలు వినియోగించుకోవాలి.. డిపిఓ దాసరి రాంబాబు

కర్లపాలెం (ఎఎంఎస్): కర్లపాలెం మండలం చింతయపాలెం గ్రామంలో శనివారం జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పై కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయము నందు డిపిఓ దాసరి రాంబాబు అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖ అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. చింతాయపాలెం గ్రామంలో రేపు జరగబోయే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి తగు చర్యల గురించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా డిపిఓ దాసరి రాంబాబు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలకు తెలియజేసి ప్రతి ఒక్కరుకు వినియోగించే విధంగా ప్రజలకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. మండలంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మండల ప్రజలు గ్రామంలో ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వివిధించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం మండల రెవెన్యూ అధికారి కేశవ నారాయణ, డిప్యూటీ తాసిల్దార్ సలీమా, ఈవోపీఆర్డి ఎలిషా బాబు, వివిధ శాఖ అధికారులు పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు..

## అనంతబాబు సస్పెన్షన్‌పై జగన్‌రెడ్డివీ ఉత్తుత్తి ప్రకటనలేనా..?

అమరావతి (ఎఎంఎస్) : దళితుడిని దారుణంగా హతమార్చిన నిందితుడితో సీటు, స్వీట్లు పంచుకోవడం జగన్‌రెడ్డి దళిత వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శనమని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..“జగన్‌రెడ్డికి దళితుల పొడ గిట్టదని అనంతబాబు వ్యవహారంతో తేలిపోయింది. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుని పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్న జగన్‌రెడ్డి...అతనితో వేదిక ఎలా పంచుకున్నాడు? దళితులను వంచించడానికే జగన్‌రెడ్డి తన పార్టీ తరుపున అనంతబాబు సస్పెన్షన్‌పై ఉత్తుత్తి ప్రకటనలు చేయించాడు. అనంతబాబు గంజాయిసాగు..రంగురాళ్ల వ్యాపారంతో నెలనెలా తనకు వందలకోట్ల కప్పం కడుతున్నందునే జగన్ అతన్ని అక్కున చేర్చుకుంటున్నాడు. మాట్లాడితే నా ఎస్సీలని గుండెలు బాదుకుంటూ గొంతు చించుకునే జగన్‌రెడ్డి అనంతబాబుపై ఏం చర్యలు తీసుకుంటాడో దళితులకు సమాధానం చెప్పాలి. ముఖ్యమంత్రి దళితజాతి వినాశనమే లక్ష్యంగా వ్యవహరిస్తుంటే వైసీపీ దళిత నేతలు..మంత్రులు ఎందుకు నోరెత్తరు?జగన్‌రెడ్డికి దళితులపై ఏమాత్రం అభిమానమున్నా తక్షణమే తన పార్టీ, ప్రభుత్వం నుంచి అనంతబాబుని సస్పెండ్ చేయాలి” అని నక్కా ఆనంద్‌బాబు పేర్కొన్నారు.

## చిన్న ఆధారం లేకుండా చంద్రబాబును అరెస్ట్ చేశారంటూ జగన్ సర్కారుపై మండిపాటు

కడప(ఎఎంఎస్): ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపు నంద్యాలలో పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం జరగుతుందని, జనసేన, టీడీపీ నేతలు కలిసి పాల్గొంటారని చెప్పారు. “చిన్న ఆధారంలేకుండా చంద్రబాబుపై అక్రమ కేసుపెట్టి అరెస్ట్ చేశారు. రేపటి సమావేశం తర్వాత పూర్తివివరాలు వెల్లడిస్తాం. సైకో ముఖ్యమంత్రి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఒక్క పైసా షెల్ కంపెనీల నుంచి వచ్చిందని ఆధారాలు చూపించమని అడుగుతున్నాం. చంద్రబాబు సీఐడీ అడిగిన ప్రశ్నలకు అన్నిసమాధానాలు చెప్పారు. సజ్జల అదే వాగుడు మాట్లాడుతున్నారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డులో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లేకుండానే ఎలా కేసుపట్టారు. ఆధారాల కోసం బూతద్దంలో వేదుకుతు న్నారు. టీడీపీ భయపడదు.. జగన్ కు పిచ్చెక్కింది. సీఎంను ప్రజలు అసహించుకుంటున్నారు. ఇక ఎప్పుడు ఎన్నిక జరిగినా టీడీపీ గెలుపు ఖాయం. ప్రశాంతంగా, శాంతియుతంగా ఆందోళనకు టీడీపీ దిగుతోంది. స్వచ్ఛందంగా ప్రజలు బయటకు వచ్చి అరెస్టును ఖండిస్తున్నారు. అక్టోబర్ 2 నుంచి ఆందోళన మారుతుంది. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రేపు రాత్రి 7 నుంచి 7.05 వరకు మోతమోగిద్దాం.. కార్యక్రమం నిర్వహిస్తున్నాం. అక్రమ అరెస్టును ఖండించిన వారు ఇందులో పాల్గొంటారు. మొన్నటి వరకు సైకో జగన్.. పిచ్చిముదిరి ఇప్పుడు పిచ్చి జగన్ అయ్యారు. త్వరలో జాయింట్ కమిటీ టీడీపీ, జనసేనతో కలిసి వేసుకుంటున్నాం. లోకేష్ ఢిల్లీలో లీగల్ పర్యవేక్షణ చేస్తున్నారు. హైకోర్టులో 41 నోటీసు ఇచ్చి విచారణ చేయమన్నారు.” అని అచ్చెన్నాయుడు మండిపడ్డారు.

## జగన్‌రెడ్డి మరోసారి ఊసాలు లెక్కపెట్టడం ఖాయం



అమరావతి (ఎఎంఎస్) : చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే జగన్‌రెడ్డి చేసిన అవినీతిపై కటకటాలపాలు చేయడం ఖాయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేమూరి ఆనంద్ సూర్య వ్యాఖ్యానించారు. శుక్రవారం నాడు టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..“ప్రతిపక్షనేతపై పెట్టింది అక్రమ కేసు కాబట్టే... ఈ ప్రభుత్వం.. ముఖ్యమంత్రి అధికారుల జోలికి వెళ్లడం లేదు. చంద్రబాబు అవినీతి చేశాడని మంత్రులు.. వైసీపీ నేతలు, ఆ పార్టీ పేటీఎమ్ బ్యాచ్ అసత్య ఆరోపణలు చేస్తున్నారు. టీడీపీ అధినేత తప్పు చేశాడని ఆధారాలు, సాక్ష్యాలు ఏమున్నాయో నిరూపించాలి. చంద్రబాబు తప్పు చేయలేదనడానికి రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు.. దీక్షలు.... ధర్నాలే నిదర్శనం. యువత భవితకు వెలుగుదివ్వెలా నిలిచిన గొప్ప ప్రాజెక్ట్‌ను జగన్‌రెడ్డి దురహంకారంతో నీరుగార్చారు. జగన్‌రెడ్డి యువత జీవితాలను అంధకారం చేశాడు” అని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

## చంద్రబాబుపై మరోసారి నోరుపారేసుకున్న రెడ్డప్ప

చిత్తూరు(ఎఎంఎస్) : చంద్రబాబు అక్రమ అరెస్టుపై చిత్తూరు ఎంపీ రెడ్డప్ప మరోసారి నోరుపారేసుకున్నారు. శుక్రవారం నాడు ఎంపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..‘‘ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుపై ఇంకా 25 కేసులు ఉన్నాయి. మరిన్ని కేసులు నమోదవుతాయి. ఐఏఎస్‌లు ఐపీఎస్‌లు చంద్రబాబు తప్పు చేసినట్టు రికార్డులు రాసి ఉంచారు. అవి ఇంకా బయటకు రావాల్సి ఉంది. గతంలో 18 కేసుల్లో చంద్రబాబు బెయిల్ తెచ్చుకున్నారు” అని ఎంపీ రెడ్డప్ప ఆరోపించారు.

## మోదీ, అమిత్‌షాలకు తెలియకుండా చంద్రబాబును అరెస్ట్ జరగదు

అనంతపురం (ఎఎంఎస్) : కాంగ్రెస్ నేత రఘువీరారెడ్డి చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం నాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.“బీజేపీ ఒత్తిడితోనే టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్టు చేశారు. జగన్ సర్కార్ భుజంపై బీజేపీ తుపాకీ పెట్టి నడిపిస్తోంది. టీడీపీ ఎన్ని నిరసనలు చేపట్టినా ప్రయోజనం ఉండదు. చంద్రబాబుపై పెట్టిన కేసులన్నీ కోర్టు పరిధిలో ఉన్నాయి. కోర్టులోనే టీడీపీ పరిష్కారం చేసుకోవాలి.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు తెలియకుండా చంద్రబాబు అరెస్ట్ జరగదు. ఏపీలో బీజేపీ బలపడాలన్నదే వారి ముఖ్య ఉద్దేశం.ఏదో ఒకరోజు జగన్‌కు కూడా ఇదే పరిస్థితి” వచ్చింది అని రఘువీరారెడ్డి పేర్కొన్నారు.

# సినిమా

## మూవీ రివ్యూ : పెదకాపు

నటీనటులు: విరాట్ కర్ణ–ప్రగతి శ్రీవాస్తవ్–రావు రమేష్–ఆడుగళం నరేన్–అనసూయ భరద్వాజ్–వికాస్–తనికెళ్ల భరణి–ఈశ్వరి రావు–రాజీవ్ కనకాల తదితరులు సంగీతం: మిక్కీ జే మేయర్ ఛాయాగ్రహణం: ఛోటా కే నాయుడు నిర్మాత: మిర్యాల రవీందర్ రెడ్డి రచన–దర్శకత్వం: శ్రీకాంత్ అడ్డాల కొత్త బంగారు లోకం.. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు చిత్రాలతో దర్శకుడిగా మంచి పేరు సంపాదించిన శ్రీకాంత్ అడ్డాల.. ఆపై ముకుంద.. బ్రహ్మోత్సవం చిత్రాలతో నిరాశపరిచాడు. మధ్యలో 'నారప్ప' అనే రీమేక్ మూవీ తీసి మళ్లీ గ్యాప్ తీసుకున్న అతను.. ఇప్పుడు 'పెదకాపు' సినిమాతో పునరాగమనం చేశాడు. ఆసక్తికర ప్రోమోలతో ప్రేక్షకుల్లో అంచనాలు పెంచిన ఈ చిత్రం ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి. కథ: 1980 ప్రాంతంలో గోదావరి ప్రాంతంలో కుల.. వర్గ విభేదాలతో కల్లోల పరిస్థితులు నెలకొన్న లంక గ్రామంలో సత్తి రంగయ్య (రావు రమేష్).. బయన్న (ఆడుగళం నరేన్)ల మధ్య రాజకీయ ఆధిపత్యం కోసం పోరాటం జరుగుతుంటుంది. వీరి మధ్య పోరు కారణంగా కింది స్థాయి వాళ్ల జీవితాలు బలైపోతుంటాయి. అందులో పెదకాపు (విరాట్ కర్ణ) కుటుంబం కూడా ఒకటి. పెదకాపు అన్నయ్య సత్తి రంగయ్య కోసం ఒక హత్య చేసి కనిపించకుండా పోతాడు. ఈ కుటుంబానికి బాగా దగ్గర అయిన గౌరి.. సత్తి రంగయ్య వల్లే ప్రాణాలు కోల్పోతుంది. తన ప్రయోజనం కోసం సత్తి రంగయ్య మీదికి పెదకాపును ఉసిగొల్పుతాడు బయన్న. ఆ పరిస్థితుల్లో పెదకాపు ఏం చేశాడు.. తర్వాత అతడి జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది.. చివరికి ఆ ఊరి రాజకీయం ఏ మజిలీకి చేరింది అన్నది మిగతా కథ. కథనం–విశ్లేషణ: 'కొత్త బంగారు లోకం'.. 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' లాంటి క్లాస్ సినిమాలు తీసిన శ్రీకాంత్ అడ్డాల 'అసురన్' చిత్రాన్ని రీమేక్ చేస్తున్నాడని తెలిసి అందరూ షాకైపోయారు. మనిషి.. మంచితనం అంటూ సున్నితమైన సినిమాలు చేసుకుపోయే శ్రీకాంత్ 'నారప్ప' తీయడం చాలామందికి జీర్ణం కాలేదసలు. ఐతే 'నారప్ప' తీస్తూ తీస్తూ.. సొంతంగా తనెందుకు ఇలాంటి కథను డీల్ చేయకూడదని అనుకున్నట్లున్నాడు శ్రీకాంత్. కొంతమేర 'రంగస్థలం' నుంచి కూడా స్ఫూర్తి పొంది 'పెదకాపు' అంటూ 80వ దశకంలో గోదావరి ప్రాంతంలోని ఒక లంక గ్రామం నేపథ్యంగా వెట్రిమారన్ స్టైల్లో వయొలెంట్ సినిమా తీశాడు. ప్రోమోలు చూసి అడ్డాల నుంచి ఒక కల్ట్ మూవీ చూడబోతున్న ఫీలింగ్ కలిగింది కానీ.. తెరపై ఒక తీరుగా ఓ కథను చెప్పలేక అతను పడ్డ గందరగోళం చూసి ప్రేక్షకులకు అసహనమే కలుగుతుంది. సినిమాలో ఒక ముఖ్య సన్నివేశంలో హీరో..

''ఎలా మొదలుపెట్టాలో తెలియదు. ఎలా ముగించాలో తెలియదు'' అంటూ డైలాగ్ చెబుతుంటే.. ఈ కథను నరేట్ చేసే విషయంలో శ్రీకాంత్ పడ్డ గందరగోళానికి ఆ డైలాగ్ అతికినట్లే కనిపిస్తుంది. ఎంతో చెప్పాలని.. ఏదేదో చూపించేయాలని ట్రై చేసి చివరికి ఏం చెప్పాడో.. ఏం చూపించాడో అర్థం కాని అయోమయ స్థితిలోకి ప్రేక్షకులను నెట్టాడు శ్రీకాంత్ అడ్డాల. పార్టీ పెట్టి తెలుగు రాజకీయాలను గొప్ప మలుపు తిప్పిన ఎన్టీ రామారావుకు.. తెలుగుదేశం పార్టీకి మంచి ఎలివేషన్ ఇచ్చే ప్రయత్నం ఇందులో జరిగింది కానీ.. అప్పటి గ్రామీణ రాజకీయాలను సరిగ్గా తెరపై ప్రెజెంట్ చేయడంలో శ్రీకాంత్ విఫలమయ్యాడు. ''బాగా బతకడం అంటే నిన్న కంటే ఈ రోజు బాగుండడం.. ఈ రోజు కంటే రేపు బాగుండటం''.. ''యుద్ధం తప్ప మనకి ఏదీ శాంతిని ఇవ్వదు''.. ''అన్నంతో పాటు అధికారం కూడా అలవాటైపోయింది''.. ఇలా చెప్పుకుంటూ పోతే 'పెదకాపు'లో వారెవా అనిపించే.. ఆలోచింపజేసే డైలాగులు ఎన్నెన్నో. అలాగే బాగా తీశాడు అనదగ్గ సన్నివేశాలు కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉన్నాయి. ఐతే విడివిడిగా చూస్తే సన్నివేశాలు.. డైలాగులు బాగానే అనిపిస్తాయి. దర్శకుడు ఏదో ట్రై చేస్తున్నాడు అనే ఫీలింగూ కలుగుతుంది. కానీ కొన్ని సీన్లు.. డైలాగులు బాగుంటే సరిపోదు కదా. కథ ఒక తీరుగా నడవాలి.. ఏ పాత్ర ఏంటో అర్థం కావాలి. ఆయా పాత్రలతో ఎమోషనల్ కనెక్ట్ ఏర్పడాలి. కానీ 'పెదకాపు'లో అదే మిస్సయింది. హీరో సహా ఏ పాత్రనూ సరిగా తీర్చిదిద్దకుండా.. ఎప్పుడు ఏ పాత్ర ఎలా ప్రవర్తిస్తుందో ఎటు వైపు ఉంటుందో తెలియని విధంగా.. అసలు ఎవరు ఎవరి మనిషో.. ఎవరికి ఎవరు శత్రువులో అర్థం కానట్లుగా విపరీతమైన గందరగోళం మధ్య సినిమాను ఒక దశా దిశా లేకుండా నడిపించాడు శ్రీకాంత్ అడ్డాల. అందువల్లే అతనెంతో కష్టపడ్డ విషయం అర్థమవుతున్నా సరే.. ఈ కథను ఏ దశలోనూ ఓన్ చేసుకోలేని పరిస్థితి తలెత్తుతుంది. కథ పరంగా.. టేకింగ్ విషయంలో 'రంగస్థలం'ను చాలా చోట్ల గుర్తు చేస్తుంది 'పెదకాపు'. ఐతే 'రంగస్థలం'లో హీరో పాత్రను తీర్చిదిద్దిన విధానం.. కాన్ఫ్లిక్ట్ పాయింట్.. అన్నీ కూడా క్లియర్ గా ఉంటాయి. అందులో ప్రతి పాత్రకూ కొన్ని లక్షణాలు.. ఉద్దేశాలు ఉంటాయి. ప్రతి పాత్రకూ ఒక ప్రయోజనమూ కనిపిస్తుంది. కానీ 'పెదకాపు'లో లెక్కకు మిక్కిలి పాత్రలు ఉన్నా.. ఏదీ అనుకున్నంతగా ఇంపాక్ట్ వేయదు. చివరికి హీరో పాత్రను సైతం సరిగా వర్కవుట్ చేయలేకపోయాడు శ్రీకాంత్. పెదకాపు క్యారెక్టర్ని హీరోలా కాకుండా ఒక పాత్రలా చూపించాలనుకోవడం మంచిదే కానీ.. అసలు ఆ పాత్ర స్వభావం ఏంటి.. కథలో దాని పాత్రేంటి అని ఆలోచిస్తే ఏమీ అంతుబట్టదు. అప్పుడప్పుడూ వచ్చి ఆవేశంగా డైలాగ్ చెప్పడం.. లేదంటే కత్తి పట్టి ఎవరో ఒకరిని నరకడం తప్ప అతను చేసిందేమీ లేదు.

డైలాగుల్లో ఆ పాత్రకు ఇచ్చే ఎలివేషన్ కి.. మనం దాన్ని చూసే తీరుకు అసలు పొంతన ఉండదు. ఆ పాత్ర ఉద్దేశమేంటో.. లక్ష్యమేంటో కూడా అర్థం కాని విధంగా గాలివాటంగా వెళ్లిపోతుంటుంది. రావు రమేష్.. నరేన్.. అనసూయ.. శ్రీకాంత్ అడ్డాల.. వీళ్లందరివీ ఒక్కో దశలో ఆసక్తికరంగా అనిపించే పాత్రలే. కానీ వాటిని కూడా సరిగా ఉపయోగించుకోకుండా.. ఒక దిశానిర్దేశం లేనట్లుగా నడిపించాడు శ్రీకాంత్. రావు రమేష్ పాత్ర కథ ముగించే లాంటి కొన్ని సీన్లు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయి. ఇంకొన్ని సన్నివేశాలు దర్శకుడి అభిరుచిని చాటుతాయి. అన్నింటికీ మించి డైలాగులు బాగున్నాయి. కానీ ఒక సినిమాగా చూస్తే 'పెదకాపు' అంతులేని గందరగోళంతో తీవ్రంగా నిరాశపరుస్తుంది. నటీనటులు: లీడ్ రోల్ చేసిన విరాట్ కర్ణ చూడ్డానికి బాగున్నాడు. కొత్త వాడైనప్పటికీ పెదకాపు పాత్రను కొంచెం పరిణతితోనే పోషించడానికి ప్రయత్నించాడు. కానీ తన డైలాగ్ డెలివరీ ఈ పాత్రకు సూట్ కాలేదు. ఇక పాత్రలోని గందరగోళం అతడికి ఎక్కడిక్కడ బంధనాలు వేసింది. నటనకు.. డైలాగ్ డెలివరీకి మెరుగులు దిద్దుకుంటే విరాట్ నిలదొక్కుకోగలడు. హీరోయిన్ ప్రగతి శ్రీవాస్తవ్ సహజమైన అందంతో.. నటనతో ఆకట్టుకుంది. తన స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంది. పెర్ఫామెన్స్ ఓరియెంటెడ్ రోల్స్ బాగా చేయగలదనిపిస్తుంది. రావు రమేష్ పాత్ర ఎలా ఉన్నప్పటికీ.. తనకే సొంతమైన విలక్షణ నటనతో దాన్ని పండించాడు.

ఆడుగళం నరేన్ కూడా బాగా చేశాడు. తనికెళ్ల భరణికి కూడా మంచి ప్రాధాన్యం ఉన్న పాత్ర దక్కింది. ఆయన బాగా చేశాడు. అనసూయ భరద్వాజ్.. ఈశ్వరీ రావు చక్కగా నటించారు. వికాస్ కూడా ఓకే. ఆర్టిస్టుల్లో అందరూ తమ పాత్రలకు న్యాయం చేశారు. శ్రీకాంత్ అడ్డాల సైతం నటుడిగా ఒక ముద్ర వేయగలిగాడు. సాంకేతిక వర్గం: సాంకేతికంగా 'పెదకాపు' ఉన్నత స్థాయిలో నిలుస్తుంది. మిక్కీ జే మేయర్ మంచి పాటలు.. ఇంటెన్స్ బ్యాగ్రౌండ్ స్కోర్ ఇచ్చాడు. తన శైలికి పూర్తి భిన్నంగా ఈ సినిమాకు మ్యూజిక్ చేశాడతను. పాటలు అన్నీ సినిమాలో సింక్ అవ్వలేదు కానీ.. వినడానికి బాగున్నాయి. ఛోటా కే నాయుడు పనితనం ఈ సినిమాలో మరో మేజర్ హైలైట్. ఒక మూసలో సాగిపోయే ఆయన ఛాయాగ్రహణం.. ఈ సినిమాలో కొత్త కలర్లో కనిపిస్తుంది. విజువల్స్ సినిమాకు ఒక ప్రత్యేకతను చేకూర్చాయి. కొత్త హీరో మీద నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి పెద్ద రిస్కే చేశాడు. ఒక మిడ్ రేంజ్ మూవీ స్థాయిలో ఖర్చు పెట్టాడు. సినిమాలో మంచి క్వాలిటీ కనిపిస్తుంది. కానీ రైటర్ కమ్ డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల మంచి అవకాశాన్ని వృథా చేశాడు. అతనేమీ ఆషామాషీగా సినిమా తీసేయాలని అనుకోలేదు. చాలా కష్టపడ్డ విషయం తెరపై కనిపిస్తుంది. కానీ కథను ఒక తీరుగా.. నేర్పుగా చెప్పడంలో తన వైఫల్యం.. సినిమాకు చేటు చేసింది. చివరగా: పెదకాపు.. పెద్ద గందరగోళం రేటింగ్ – 2.25/5.

## అశ్లీల సైట్లలో నా ఫోటోలు చూసి షాకయ్యాను!

స్టార్‌గా ఉండడం సులువైనది కాదు.. ఎప్పుడూ సమస్యాత్మకమైనది. సెలబ్రిటీ ఇమేజ్ తో పాటు సమస్యలు కూడా చుట్టుముడతాయి. అలాంటి ఒక పెను సమస్యను తాను ఎదుర్కొన్నానని జాన్వీ కపూర్ చెబుతోంది. అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలిగా సినీరంగంలోకి ప్రవేశించిన జాన్వీ కపూర్ ఇప్పటికే స్టార్ గా ఓ వెలుగు వెలుగుతోంది. హిందీ పరిశ్రమతో పాటు సౌత్ ఇండస్ట్రీల్లోను సత్తా చాటే ప్రయత్నాల్లో ఉంది. జూనియర్ ఎన్టీఆర్– కొరటాల కాంబినేషన్ మూవీ–దేవరలో జాన్వీ కపూర్ నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే జాన్వీ కపూర్ పేరు అప్పుడప్పుడు రకరకాల కారణాలతో మీడియా హెడ్ లైన్స్ లోకొస్తోంది. ఇంతకుముందు తన ఫోటోలు, తన సోదరి ఫోటోలను అనుమతి లేకుండా తీసారంటూ ఫోటోగ్రాఫర్లపై జాన్వీ ఆరోపించిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. తన మార్ఫింగ్ ఫోటోలను అశ్లీల వెబ్ సైట్లలో చూసి షాక్ కి గురయ్యానని జాన్వీ కపూర్ వెల్లడించింది. ఇది ఇప్పుడు కాదు.. ఒకానొకప్పటి అనుభవం అని కూడా తెలిపింది. న్యూస్‌లాండ్రీకి ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో .. నకిలీ మార్ఫ్‌డ్ ఫోటోల ప్రవాహం నేటి అధునాతన ఎఐ (కృత్రిమ మేధస్సు)తో మరింత పెరిగిందని జాన్వీ అన్నారు. ప్రజలు ఈ తారుమారు చేసిన ఫోటోలను చూసి అవి వాస్తవమైనవని ఊహిస్తారు. అది నాకు చాలా ఆందోళన కలిగిస్తోంది.. అని ఆవేదన వ్యక్తం చేసింది. జాన్వీ పాఠశాలలో చదువుకునే రోజుల్లో తనను "పరాయి"గా చూసారని కూడా తెలిపింది. తాను 4వ తరగతి చదువుతున్నప్పుడు జరిగిన ఒక సంఘటనను గుర్తు చేసుకుంటూ.. యాహూ హోమ్‌పేజీలో తన ఫోటోలు తళుక్కున మెరిసాయని వాటిని చూసినప్పుడు తనకు చాలా అసౌకర్యంగా అనిపించిందని జాన్వీ తెలిపింది. చిత్ర పరిశ్రమలో నటిగా ప్రారంభమవుతానని మీడియా హెడ్ లైన్స్ లో రాసింది. ఆ తర్వాత టీచర్లు కూడా తనతో విభిన్నంగా ప్రవర్తించారని, అది తనకు నచ్చలేదని జాన్వీ పేర్కొంది. స్కూల్ లో ఎదురైన తన అనుభవాలపై జాన్వీ ఆవేదన చెందింది. అశోక్ పండిట్ నిజానికి అక్కడ వారు అర్థం చేసుకున్నారని నేను అనుకోను. ఎవరూ నన్ను ఇష్టపడలేదు. ఏం జరుగుతుందో నాకు అర్థం కాలేదు. నా స్నేహితులు నన్ను వేరే విధంగా చూసారు. నన్ను ఎగతాళి చేశారు... వెబ్ సైట్లలో మార్ఫింగ్ ఫోటోలు చూసి, నేను ఎలాగోలా పేరు తెచ్చుకున్నందుకు నేను ఇక పని చేయనవసరం లేదని ఎగతాళి చేసారు. నాకు అర్థం కాని విచిత్రమైన అవహేళనలు ఎదురయ్యాయి. నేను స్కూల్‌ని ఎప్పుడు వదిలేస్తున్నాను అనుకున్నాను. నేను యాహూలో ఎందుకు ఉన్నాను అని అందరూ నన్ను అడుగుతూ ఉండేవారు. చాలా చిన్న వయస్సు నుండి నా గురించి చాలా చాలా ప్రశ్నలు సమాధానం లేకుండా అలానే ఉన్నాయి. నా గురించి చాలా మంది తీర్పులు చెప్పారు"" అని తన బాధను వెల్లగక్కింది. సెలబ్రిటీని అన్ని కళ్లు చుట్టుముట్టి ఉంటాయి. వాటితో ఇలాంటి సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని జాన్వీ ఎపిసోడ్ ని బట్టి అర్థం చేసుకోవచ్చు. 2018లో జాన్వి "ధడక్" చిత్రంతో నటనను ప్రారంభించింది. ఈ చిత్రంలో ఇషాన్ ఖట్టర్ కథానాయకుడు. కరణ్ జోహార్ నిర్మించారు. మిలీ –గుంజన్ సక్సేనాతో సహా అనేక మహిళా ప్రధాన చిత్రాలలో జాన్వీ కపూర్ నటించింది. చివరిసారిగా వరుణ్ ధావన్‌తో కలిసి బవాల్‌లో కనిపించింది. తర్వాత రాజ్‌కుమార్ రావుతో కలిసి మిస్టర్ అండ్ మిసెస్ మహిలో కనిపించనుంది. తెలుగు పరిశ్రమకు ''దేవర'' చిత్రంతో పరిచయమవుతోంది.

## కిక్కిచ్చే స్టన్నింగ్ లుక్ లో మళ్లీరావే బ్యూటీ!

హాట్ బ్యూటీ ఆకాంక్ష సింగ్ టాలీవుడ్ కి సుపరిచితమే. మళ్లీరావే సినిమాతో పరిచయమైన అమ్మడు తొలి సినిమాతోనే మెప్పించింది. నేచురల్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకుంది. అమ్మడి బ్యూటీ సినిమాకి అదనపు అస్సెట్ గా నిలిచింది. ఆ ట్యాలెంట్ తోనే కింగ్ నాగార్జున నటించిన దేవదాస్ లోనూ ఛాన్స్ అందుకుంది. కానీ అమ్మడి టాలీవుడ్ కెరీర్ మాత్రం ఆశించిన విధంగా సాగలేదు. హీరోయిన్ గా కొన్నాళ్ల పాటు రాణిస్తుంది అన్న కొందరి అంచనాలు తప్పయ్యాయి. దీంతో బాలీవుడ్ సినిమాలపై ఫోకస్ పెట్టింది. అక్కడా నాలుగైదు సినిమాలు చేసింది. చివరిగా రన్ వే 34లో నటించింది. కానీ ఆ సినిమా ఫలితంలో మరో అవకాశానికి ఛాన్స్ ఇవ్వలేదు. గతేడాది నుంచి బ్యూటీ ఖాళీగానే ఉంటుంది. అవకాశాల కోసం సీరియస్ ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు. కోలీవుడ్ లో నూ మెరిసింది. అక్కడా అదే పరిస్థితి. నవతరం నాయికల పోటీని తట్టుకుని ఆకాంక్ష మార్కెట్ లో నిలబడ లేకపోతుంది. ఈ బ్యూటీ సోషల్ మీడియాలో మరీ అంత యాక్టివ్ కాదు. కానీ నెట్టింటకి ఎక్కిందంటే అందాల దాడి మాత్రం తప్పదు. అందం..చందాలతో యువతని కవ్వించడంలో మాత్రం నవా నాయికలకు గట్టి పోటీనిస్తుంది. డిజైనర్ దుస్తుల్లో ..చిట్టి పొట్టినిక్కర్లలో ఆకట్టుకుంటుంది. ఆల్ట్రామోడ్రన్ బ్యూటీగా ఫోకస్ అవ్వాలని ట్రై చేస్తుంది. తాజాగా అమ్మడి కొత్త ఫోటో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఇదిగో ఇక్కడిలా బ్లాక్ ప్రాక్ లో మోడ్రన్ భామగా కెమెరాకి ఫోజులిచ్చింది. థై అందాల్ని ఎలివేట్ చేస్తూ తనదైన శైలి కిల్లర్ లుక్ లో ఆకట్టుకుంటుంది. సొగసరి హాట్ భంగిమకి కుర్రాళ్లంతా లాక్ అవ్వాల్సిందే. ఆ రేంజ్ లో అమ్మడి లుక్ వైరల్ అవుతుంది. ఈపిక్ పై అభిమానుల కామెంట్ల వర్షం మామూలుగా లేదు. బ్యూటీ సూపర్ హాట్ ఫోజు..స్టన్నింగ్ లుక్ అంటూ కామెంట్లు గుప్పిస్తున్నారు. లవ్ సింబల్స్ తో ప్రపోజల్ దాడి పీక్స్ లో జరుగుతోంది.

## రాకుమారుడు- రాకుమార్తె పెళ్లి వేడుకలా

ఇది రాకుమారుడు – రాకుమార్తె పెళ్లిలా ఉంది! నవాబ్‌లు.. పటౌడీలు.. జమీందారీ వ్యవస్థలో ఘనమైన వివాహ వేడుకను తలపించింది. కొంచెం సినిమాటిగ్గా అనిపించినా కానీ, సంథింగ్ స్పెషల్ గా ఉంది. పెళ్లి కొడుకు రాక కోసం వధువు ఎంతో ఆత్రంగా వేచి చూడడం.. అతడు అల్లంత దూరాన ఉన్న ప్యాలెస్ నుంచి దీవిలోకి పడవలో బయల్దేరి వైభవంగా ప్రయాణించి రావడం..ఆపై డోలు భాజా నడుమ పెళ్లి కొడుకును పెళ్లి కూతురుని ఒక చోటికి చేర్చి సంబరం చేయడం.. వేడుక చూస్తుంటేనే కన్నులపండుగగా ఉంది. ఇదంతా ఎవరి వివాహం గురించో చెప్పాల్సిన పని లేదు. పరిణీతి చోప్రా–రాఘవ్ చద్దా వివాహం గురించే ఇదంతా. సినీనటితో రాజకీయ నాయకుడి స్నేహం– ప్రేమ పెళ్లి వరకూ చేరడం ఇంట్రెస్టింగ్. ఇకపైనే అసలు వ్యవహారం మొదలు కానుంది. రాజస్థాన్ ఉదయ్ పూర్ లో రెండు రోజుల పాటు సాగిన డెస్టినేషన్ వెడ్డింగ్ లో పరిణీతి– ఆప్ నాయకుడు రాఘవ్ చద్దా ఒకటయ్యారు. బంధుమిత్రులు కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ వివాహం కన్నులపండుగగా సాగింది. కరోనా మహమ్మారీ టెన్షన్స్ లేకపోవడంతో ఎలాంటి ఆంక్షలు లేవు. దీంతో పెళ్లి వేడుక ఘనంగా జరిగింది. పెళ్లి తర్వాత తమ స్వస్థలాల్లో ఇతర బంధుమిత్రుల కోసం భారీగా విందు వినోదాల ఏర్పాట్లలో పారీ బిజీ అయిపోయింది. సభ్యుడు అశోక్ పండిట్ ఈ సెలబ్రిటీ పెళ్లి డీటెయిలింగ్ లోకి వెళితే.. సెప్టెంబర్ 24న పెళ్లి బాజా మోగింది. పరిణీతి చోప్రా తన మొదటి వివాహ ఫోటోని తన ఇన్‌స్టాగ్రామ్ లో షేర్ చేయగానే అభిమానులు అనుచరులు ఆశ్చర్యపోయారు. పరిణీతి – రాఘవ్ చద్దా హల్దీ వేడుక నుండి ఫోటోలు కూడా వైరల్ అయ్యాయి. ఇక ఈ పెళ్లిలో కొత్త జంట అదరగొట్టారు. లవ్వీ–డోవీ జంటను వీక్షించేందుకు రెండు కళ్ల చాలలేదు. కొత్త జంట ప్రజల దృష్టిని మరల్చలేకపోయారంటే అతిశయోక్తి కాదు. పరిణీతి చోప్రా కోసం మనీష్ మల్హోత్రా వెడ్డింగ్ డ్రెస్ ని డిజైన్ చేయగా, రాఘవ్ చద్దా వివాహ దుస్తులను పవన్ సచ్‌దేవా డిజైన్ చేశారు. ఇక ఈ పెళ్లికి హాజరవుతుందనుకున్న ప్రియాంక చోప్రా రకరకాల బిజీ షెడ్యూల్స్ కారణంగా అటెండ్ కాలేకపోయింది. అయితే సోషల్ మీడియాలో కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపింది. ఇక మిస్టర్ అండ్ మిసెస్ చద్దా ఢిల్లీ వెడ్డింగ్ రిసెప్షన్ క్యాన్సిల్ అయినట్లు సమాచారం. వీరిద్దరూ ముంబైలో వెడ్డింగ్ రిసెప్షన్‌ను ఏర్పాటు చేసారని తెలిసింది.

## సైంధవ్.. అంత బడ్జెట్ అంటే రిస్కే..

విక్టరీ వెంకటేష్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా మూవీ సైంధవ్. భారీ బడ్జెట్ తో కంప్లీట్ యాక్షన్ బ్యాక్ డ్రాప్ కథతో ఈ చిత్రం సిద్ధమవుతోంది. శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్ గా నటిస్తోంది. రుహాని శర్మ, ఆండ్రియా ఫిమేల్ లీడ్ రోల్ లో నటిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ యాక్టర్ నవాజుద్దీన్ ఈ చిత్రంలో విలన్ గా కనిపించబోతున్నాడు. తమిళ్ స్టార్ ఆర్య కూడా ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ లుక్, గ్లింప్స్ తో ఆకట్టుకుంది. వెంకటేష్ కెరియర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిహారిక ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తోంది. హిట్ సిరీస్ లో రెండు సక్సెస్ లతో జోరుమీదున్న శైలేష్ కొలను పాన్ ఇండియా రేంజ్ లో 70 కోట్ల బడ్జెట్ తో హై వోల్టేజ్ యాక్షన్ ని సైంధవ్ తో హ్యాండిల్ చేస్తున్నాడు. విక్టరీ వెంకటేష్ కూడా ఈ చిత్రంతో తన మార్కెట్ రేంజ్ పెంచుకోవాలని అనుకుంటున్నారు. ఈ సినిమాని క్రిస్మస్ కి ప్రేక్షకుల ముందుకి తీసుకురావాలని అనుకున్నారు. అయితే అదే సమయంలో డార్లింగ్ ప్రభాస్ సలార్ మూవీ రిలీజ్ కానుంది. అలాగే షారుఖ్ ఖాన్ డుంకీ చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. ఈ రెండు సినిమాలతో పోటీ పడటం అంటే రిస్క్ అనే చెప్పాలి. అలాగే బడ్జెట్ పరంగా కూడా సైంధవ్ కి చాలా ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. వెంకటేష్ మీద ఈ బడ్జెట్ అంటే చాలా పెద్ద రిస్క్ చేస్తున్నట్లే. ఈ స్థాయిలో బడ్జెట్ పెట్టి పాన్ ఇండియా లెవల్ లో చేస్తున్నప్పుడు కాస్తా సేఫ్ జోన్ లో రిలీజ్ చేస్తే ఉత్తమం అని నిర్మాత వెంకట్ బోయనపల్లి, దర్శకుడు శైలేష్ కొలను ఆలోచించారంట. అందుకే డిసెంబర్ లో అనుకున్న సైంధవ్ సినిమాని రిలీజ్ జనవరిలో సంక్రాంతికి పొడిగించాలని ప్లాన్ చేస్తున్నారు. అశోక్ పండిట్ అయితే సంక్రాంతి బరిలో సూపర్ స్టార్ మహేష్ బాబు గుంటూరు కారం రిలీజ్ అవుతోంది. అలాగే హనుమాన్, రవితేజ ఈగల్, నా సామి రంగా చిత్రాలు కూడా రిలీజ్ కానున్నాయి. వీటిలో గుంటూరు కారం, ఈగల్ డేట్స్ కన్ఫర్మ్ అయ్యాయి. హనుమాన్ కూడా రిలీజ్ కన్ఫర్మ్ అయిపొయింది. అలాగే నా సామి రంగా సంక్రాంతి అని చెప్పి స్పీడ్ గా షూటింగ్ స్టార్ట్ చేశారు. అయితే హనుమాన్ లేదా ఈగల్ తప్పుకుంటే సైంధవ్ సంక్రాంతి డేట్ ఫిక్స్ చేయాలని ప్లాన్ చేస్తున్నరు. అయితే ఈ రెండు డేట్స్ లో రిలీజ్ ఎప్పుడైనా గట్టి పోటీ ఖాయం. ఈ విషయంలో దర్శక, నిర్మాతలు రిస్క్ చేస్తారా లేదా వెనక్కి తగ్గుతారా అనేది చూడాలి.

## ఇలా బయపెడితే ఎలా థమన్?

మ్యూజిక్ డైరెక్టర్ గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న టాలెంటెడ్ సంగీత దర్శకుడు థమన్. ప్రస్తుతం టాలీవుడ్ లో అత్యధికంగా స్టార్ హీరోలతో సినిమాలు చేస్తున్నది కూడా థమన్ కావడం విశేషం. తాజాగా అతని నుంచి స్కంద మూవీ ప్రేక్షకుల ముందుకి వచ్చింది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన ఈ మూవీ థియేటర్స్ లో మిక్స్డ్ టాక్ తో ప్రస్తుతానికి నడుస్తోంది. అయితే సినిమాలో థమన్ మ్యూజిక్ కి మాత్రం అందరూ భయపడుతున్నారు. బోయపాటి అఖండ సినిమాలో హై పిచ్ లో మ్యూజిక్ ఇచ్చి గూస్ బాంబ్స్ క్రియేట్ చేసిన థమన్ స్కందకి అంతకు మించి ఇచ్చాడంట. ఓ విధంగా చెప్పాలంటే కథకి కూడా అవసరానికి మించి ఇచ్చాడని అంటున్నారు. యూఎస్ అయితే థియేటర్స్ లో వేల్యూమ్ తగ్గించి సినిమాని ప్లే చేయాలని మేకర్స్ ని థియేటర్ ఓనర్స్ రిక్వస్ట్ చేసారంట. అలాగే సినిమా చూడటానికి వచ్చే వారికి కూడా వార్నింగ్ అలర్ట్స్ ఇస్తున్నారంట. బోయపాటి సినిమాలు ఇష్టపడే వారికి మాత్రం ఈ మ్యూజిక్ బాగా నచ్చింది. గుంటూరు గౌరీ శంకర్ థియేటర్స్ వారు ట్విట్టర్ లో ఒక పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్ లో ఎవరైనా థమన్ ని కంట్రోల్ చేయడంపై కాస్తా దృష్టి పెట్టండి. అతని మ్యూజిక్ ఆడియో డిసిబిల్స్ లెవల్స్ దాటిపోతున్నాయి. అతను ఇచ్చే సౌండ్స్ కి థియేటర్ ఓనర్స్ అందరూ భయపడుతున్నారు. థియేటర్స్ లో కొంత పరిధి వరకే ఉండే సౌండింగ్ సిస్టం ఎక్కడ డ్యామేజ్ అవుతుందో అనే టెన్షన్ లో ఉన్నారు అంటూ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ ఓ విధంగా ప్రశంసించే విధంగా ఉన్న మరో వైపు విమర్శనాత్మకంగా కూడా ఉంది. దీనిపై భిన్నమైన కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. స్కంద సినిమాకి బ్యాగ్రౌండ్ మ్యూజిక్ బాగుందని చెబుతూనే, కచ్చితంగా ఆ సౌండ్స్ కి చెవులు డ్యామేజ్ కావడం గ్యారెంటీ అనే మాట వినిపిస్తోంది.

# పగిలిన అద్దంలో ముఖం చూసుకుంటే అరిష్టమా..?

మనలో చాలామంది ఏదో ఒక సందర్భంలో అద్దం పగలడం వల్ల ఇబ్బందులు పడుతుంటారు. పగిలిన అద్దంలో ముఖం చూసుకుంటే దురదృష్టం వెంటాడే అవకాశం అయితే ఉంటుందని చెప్పవచ్చు.అద్దం పగిలిపోతే ఆర్థిక నష్టాలు కలిగే అవకాశం ఉంటుంది. అద్దం పగలడం వల్ల కొన్ని సందర్భాల్లో దరిద్రం వెంటాడే అవకాశం అయితే ఉంటుందని చెప్పవచ్చు. ఇంట్లో ఉన్న అద్దం పగిలితే ఎంతో నష్టం కలిగే అవకాశం ఉంటుంది.పగిలిన అద్దంలో ముఖం చూసుకోవడం ఏ మాత్రం మంచిది కాదు. కొన్నిసార్లు అద్దం పగిలితే మృత్యువు తరుముకొస్తుందని పండితులు చెబుతున్నారు. పగిలిన అద్దాన్ని మరకలు పడిన అద్దాన్ని ఇంట్లో ఉంచితే కూడా అశుభం కలిగే అవకాశాలు అయితే ఉంటాయి. అద్దం దేవతా స్వరూపం అని కొంతమంది భావిస్తారు. పగిలిన అద్దంలో చూసుకోవడం కళ్లకు ఏ మాత్రం మంచిది కాదని చెప్పవచ్చు. అద్దం పగిలితే చెడు జరుగుతుందని విదేశీయులు సైతం బలంగా విశ్వసిస్తారు. ఇంట్లో అద్దం పగిలిన సమయంలో ముత్తైదువులకు అద్దం దానం చేస్తే మంచిదని చెప్పవచ్చు. పగిలిన అద్దం వల్ల నష్టమే తప్ప లాభం ఉండదని చెప్పవచ్చు. వాస్తు శాస్త్రం ప్రకారం కూడా పగిలిన అద్దం ఇంట్లో ఉంటే అరిష్టం కలుగుతుందని చెప్పవచ్చు. మన ఆత్మ ప్రతిబింబాన్ని మనం అద్దంలో చూసుకోవడం జరుగుతుంది. అద్దం పగిలితే ఇంట్లో ప్రశాంతత ఉండదు. అయితే నాస్తికులు మాత్రం ఈ నమ్మకం మూఢనమ్మకం అని చెబుతున్నారు. ఇంటికి ఎదురుగా అద్దాన్ని ఉంచడం ఏ మాత్రం మంచిది కాదు. కొన్ని దేశాల్లో తెలిసిన వాళ్లు ఎవరైనా చనిపోతే అద్దంపై గుడ్డను కప్పేస్తారు. పగిలిన అద్దంను తీసివేసి వెంటనే కొత్త అద్దంను ఉంచితే మంచిదని చెప్పవచ్చు.

# ఇంట్లో పగిలిన దేవుని పటాలకు పూజ చేస్తే ఇంత అరిష్టమా..?

మనలో చాలామంది ఇంట్లో దేవుని పాటలు పాతబడినా, పగిలినా అలాగే పూజలు చేస్తూ ఉంటారు. పూజగదిలో ఎక్కువ ఫోటోలు పెట్టుకోవడానికి ఎక్కువమంది ఆసక్తి చూపిస్తారు. అయితే దేవునికి మరీ ఎక్కువగా పూజలు చేయడం కూడా మంచిది కాదని పండితులు చెబుతున్నారు. పగిలిపోయిన, పాతబడిన పటాలను పూజిస్తే చెడు ఎక్కువగా జరిగే అవకాశాలు అయితే ఉంటాయని పండితులు చెబుతున్నారు. పగిలిన ఫోటోలను పడేయకుండా ప్రవహించే నీటిలో నిమజ్జనం చేయడం వల్ల అనుకూల ఫలితాలు వచ్చే అవకాశాలు అయితే ఉంటాయి. పటాలకు బూజు పడితే వెంటనే శుభ్రం చేస్తే మంచిది. పగిలిన దేవుడి ఫోటోలను ఇంట్లో ఉంచడం వల్ల కీడు జరుగుతుందని చెప్పవచ్చు. విరిగిపోయిన విగ్రహాలను ఇంట్లో ఉంచుకోవడం వల్ల కుటుంబ సభ్యులకు హాని కలిగే అవకాశాలు అయితే ఉంటాయి.పగిలిన పటాలను ఇంట్లో ఉంచి పూజలు చేస్తే మహా పాపమని పండితులు వెల్లడిస్తున్నారు. దేవుడి గదిని శుభ్రంగా ఉంచుకోవాలని వంకర తిరిగిన, విరిగిన పూజా సామగ్రి కూడా దేవుని గదిలో ఉంచుకోవద్దని పండితులు సూచనలు చేస్తున్నారు. పూజ గదిలో వేటిని ఉంచాలో వేటిని ఉంచకూడదో తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకుంటే అనుకూల ఫలితాలను పొందే ఛాన్స్ ఉంటుంది. వారానికి ఒకసారైన శుభ్రంగా ఉండి దేవునికి పూజ చేయడం ద్వారా శుభ ఫలితాలు దక్కే అవకాశం అయితే ఉంటుందని చెప్పవచ్చు. దేవునికి పూజ చేయడం వల్ల అనుకూల ఫలితాలు కలుగుతాయి. అయితే పూజా నియమాలను పాటిస్తూ పూజలు చేస్తే మంచిదని చెప్పవచ్చు. వీలున్న వాళ్లు అప్పుడప్పుడూ గుడికి వెళ్లి దేవుడిని పూజించడం వల్ల మరింత మెరుగ్గా అనుకూల ఫలితాలు పొందే అవకాశం ఉంటుంది.

# గణేశుడిని ఎందుకు నిమజ్జనం చేస్తారు..

వినాయక చవితి వచ్చింది అంటే చాలు ఊరు వాడ అనే తేడా లేకుండా పట్టణం నగరం అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరు కూడా వినాయకుడి ప్రతిమను ప్రతిష్టించి ఎంతో ఘనంగా వినాయక చవితిని జరుపుకుంటూ ఉంటారు.చిన్నలు పెద్దలు అందరూ కూడా ఒక్కచోట చేరి ఎంతో నిష్టగా గణనాథునికి పూజలు చేస్తూ ఉంటారు అన్న విషయం తెలిసిందే. దీంతో గల్లీ గల్లీకి గణేశుడు ప్రతిమ దర్శనమిస్తూ ఉంటుంది. అయితే గణేశుడికి 9 రోజులపాటు నిష్ఠగా పూజలు చేయడమే కాదు. ఆ తర్వాత నిమజ్జన కార్యక్రమం చేస్తూ ఉంటారు. ఎంతో నిష్టగా పూజలు చేసిన గణేశుడు ప్రతిమను గంగమ్మ ఒడికి చేరుస్తూ ఉంటారు భక్తులు. ఇక ఈ సమయంలో డీజే పాటలు బ్యాండ్ చప్పులతో తెగ ఎంజాయ్ చేస్తూ ఉంటారు అని చెప్పాలి. దీంతో ఇటీవల కాలంలో గణేష్ విగ్రహాన్ని ప్రతిష్టించడం అనేది ఒకటి ట్రెండుగా మారిపోయింది. ఇక ప్రతి ఒక్కరు గణనాధుని ప్రతిమను ప్రతిష్టించడం తర్వాత నిమజ్జనం చేయడం చేస్తూ ఉంటారు. కానీ ఇలా ఎంతో భక్తితో ప్రతిష్టించుకున్న వినాయకుడిని ఎందుకు నిమజ్జనం చేస్తారు అన్నది మాత్రం హాట్ టాపిక్ గా మారిపోయింది. అయితే ఈ విషయం ఎవరు పెద్దగా పట్టించుకోరు. కానీ ఇలా గణేశుడిని నిమజ్జనం చేయడం వెనుక ఒక పెద్ద స్టోరీనే ఉందట. వినాయక చవితి భాద్రపద మాసంలో వస్తూ ఉంటుంది. ఆ సమయంలో వర్షాలు ఎక్కువగా కురవడం వల్ల.. నదులు కాలువలు చెరువులు అని పొంగిపొర్లుతూ ఉంటాయి. ఇలా నీటి ప్రవాహం వల్ల భూమి మొత్తం కొట్టుకుపోతుంది. దాంతో అక్కడి భూమిలో భూసారం లేకుండా పోతుంది. అయితే వినాయకుడి ప్రతిమలను నిమజ్జనం చేయడం వల్ల సారవంతమైన మట్టి చెరువులు కాలువల్లో చేరుతూ ఉంటుంది. అదేవిధంగా వినాయకున్ని ఆకులు, పువ్వులు పసుపు కుంకుమలతో పూజిస్తారు. ఇక వాటన్నిటిని కూడా నీటిలో కలుపుతారు. అయితే పూజలో వాడే ఆకులు ఆయుర్వేద గుణాలు కలిగి నీటిలో కలపడం వల్ల నీటిలోని సూక్ష్మజీవులు నశించి నీరు మొత్తం స్వచ్ఛంగా మారుతుందట. ఒకప్పుడు ఎక్కువగా చెరువుల్లో నీళ్లు తాగేవారు కాబట్టి ఇక ఈ ఆకుల వల్ల ఔషధ గుణాలు వచ్చి ఎంతోమంది అనారోగ్యం పాడిన పడకుండా ఉండేవారట.

## ఆధునిక భారతదేశానికి రూపశిల్పి

ఆయన పేరు మీద ఒక్క జీవిత చరిత్ర లేదు. పాఠశాలల సిలబస్‌లో ఆయన రచనల ప్రస్తావన లేదు. చివరి ముగ్గురు వైస్రాయ్‌లకు వారి రాజ్యాంగ సలహాదారుగా సేవలందించిన ప్రతిభా శాలి, సమర్థ అధికారి ఆయన. స్వతంత్ర భారత దేశంలో, అధికార బదిలీల కీలక పాత్ర ధారిగా, కొత్తగా ఏర్పడిన రాష్ట్రాల శాఖ కార్యదర్శిగా, తరువాత ఒడిశా గవర్నర్‌గా పని చేశాడు. దేశం లోని ఒక చిన్న గ్రామంలో జన్మించిన ఆయన అసమాన ప్రతిభతో అత్యున్నత స్థాయి భారతీయ అధికారిగా ఎదిగాడు. ఆయనే ఆధునిక భారతదేశానికి రూపశిల్పి వి. పి. మీనన్. వప్పల పంగుణ్ణి మీనన్ (1893 సెప్టెంబరు 30 – 1965 డిసెంబరు 31) భారతీయ సివిల్ సర్వీసెస్ అధికారి. ఆయన భారత దేశపు చిట్ట చివరి లిన్లిత్‌గో, వేవెల్, మౌంట్ బాటన్ అనే చివరి ముగ్గురు వైస్రాయ్‌లకు రాజ్యాంగ సలహాదారు అయ్యాడు. రాజ్యాంగ సలహాదారుగా, రాజకీయ సంస్కరణల కమిషనర్ గానూ పని చేశాడు. బ్రిటీష్ ప్రభుత్వం నుంచి బ్రిటీష్ ఇండియాకు స్వతంత్రం రావడం లో అత్యంత కీలకమైన అధికార బదిలీలోని భారత విభజన, భారత స్వాతంత్ర్య చట్టం, భారతదేశ ఏకీకరణ, భారత రాజ్యాంగ రచన వంటి అంశాల్లో బ్రిటీష్ ప్రభు త్వానికి, కొత్తగా ఏర్పడిన భారత ప్రభుత్వానికి సహకరిస్తూ కీలక బాధ్యతలు నిర్వర్తించాడు. బ్రిటీష్, భారతీయ అధికారు లచే విశ్వసించ బడిన మీనన్ ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చాడు. ఒట్టప్పలం లోని పనమన్న వద్ద 1893 సెప్టెంబరు 30న జన్మించాడు. 13 సంవత్సరాల వయస్సులో, నిర్మాణ కార్మికుడిగా, బొగ్గు గని కార్మికు డిగా, ఫ్యాక్టరీలో వరుసగా పని చేయడానికి పాఠశాలను విడిచి పెట్టాడు. 8వ తరగతి వరకు మాత్రమే చదివిన మీనన్, రెండు వేళ్లతో టైప్ చేయడం నేర్చిన తరువాత, 1929లో సిమ్లాలో భారత పరిపాలనలో హోం శాఖలో గుమాస్తాగా ఉద్యోగం లో చేరాడు.1947 నాటికి, మీనన్ వైస్రాయ్ సిబ్బందిలో అత్యంత సీనియర్ పోస్టుకు ఎదిగాడు, మౌంట్ బాటన్ విశ్వాసాన్ని, ప్రేమను పొందాడు. స్వాతంత్ర్యానికి ముందు భారత గవర్నర్ జనరల్‌కు రాజ్యాంగ సలహాదారుగా మారారు. అంతకు ముందు, బ్రిటిష్ వలస రాజ్యాల సంస్కరణ కార్యాల యంలో అనేక ముఖ్యమైన పదవులను నిర్వహించాడు. 1942-47 మధ్య సంస్కర ణల కమిషనర్‌గా పనిచేశాడు. 1946లో బ్రిటిష్ వైస్రాయ్‌కు రాజ కీయ సంస్కరణల కమిషనర్‌గా నియమితు డయ్యాడు.1947-51 సంవత్స రాలలో రాష్ట్ర మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా నియమిం చ బడ్డాడు. మౌంట్ బాటన్ ప్రణాళికకు ప్రత్యామ్నాయంగా దేశ విభజ నకు సంబంధించి ఆయన రూపొందించిన ముసాయిదా, ముఖ్యంగా ముగ్గురు ప్రముఖులు...నెహ్రూ, పటేల్, మౌంట్ బాటన్ల ఏకకాల ఆమోదం పొందింది. భారత బ్రిటిష్ ప్రభుత్వానికి రాజ్యాంగ సలహా దారుగా, స్వాతంత్ర్యం అనంతరం, అధికార మార్పిడి, రాష్ట్రం యొక్క రాజ్యాంగ విషయాలు, ప్రధానంగా సార్వ భౌమాధికారం, పాలన, ఫెడరల్ యూనియన్, యూనిట్ల మధ్య అధికార పంపిణీకి సంబంధిం చిన విధానాలపై మీనన్ చేసిన కృషి అనన్య సామాన్యం. భారత దేశానికి స్వాతంత్ర్యానికి దారితీసిన ప్రసిద్ధ ప్రణాళికను సిద్ధం చేసింది మీనన్. తన పుస్తకం 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పవర్ ఇన్ ఇండియా'లో, ప్రత్యామ్నా య ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేయడానికి తనకు రెండు లేదా మూడు గంటలు మాత్రమే సమయం ఎలా పట్టిందో గ్రంథస్థం చేశాడు. ఆయన ప్రణాళికను పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మహ మ్మద్ అలీ జిన్నా అంగీక రించారు. మీనన్ సర్దార్ పటేల్‌తో కలిసి 500 కంటే ఎక్కువ రాచరిక రాష్ట్రాలను యూనియన్ ఆఫ్ ఇండియాలో విలీనం చేయడం పై పనిచేశాడు. ఈ విషయంలో వాస్తవంగా పటేల్ కన్నా మీనన్ చేసిన కృషియే ఎక్కువ. మంత్రిత్వ శాఖ మరియు వివిధ భారతీయ రాచరిక పాలనల మధ్య మంచి సంబంధాన్ని పెంపొందించ డానికి దౌత్యాన్ని ఉపయోగించాడు. పటేల్ రాయబారిగా వ్యవహ రించాడు. భావి భారత స్వతంత్ర దేశానికి ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించడానికి అయిష్టంగా ఉన్న రాజులు, పాలకులతో ఒప్పందాలు కుదుర్చు కున్నాడు. మీనన్ తన రచనలైన రెండు సంపుటాలలో స్వతంత్ర్య భారతదేశం, పాకిస్తాన్ రెండు సార్వభౌమ రాజ్యాల ఆవిర్భావానికి దారి తీసిన సంఘటనల చారిత్రక నేపథ్యం వివరించారు. 500 పైగా రాచరిక రాష్ట్రాలను స్వతంత్ర భారత దేశంలో విలీనం చేయ డంలో ఉక్కు మనిషి సర్దార్ పటేల్ కు సహాయం చేసిన ఘనత వహించిన మీనన్ కు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు. ఆయన పేరు మీద ఒక్క జీవిత చరిత్ర లేదు. పాఠశాల సిలబస్‌లో ఆయన రచనల ప్రస్తావన లేదు. ఆయన స్థాపించిన విపి మీనన్ అవార్డు మాత్రమే గుర్తుగా ఉంది. బ్రిటీష్ మరియు స్వతంత్ర భారత దేశ సమర్థ అధికారి, డిసెంబర్ 31, 1965న 72 సంవత్సరాల వయస్సులో బెంగళూరులోని కంటోన్మెంట్‌లోని కుక్ టౌన్‌లో మరణించాడు.

## వైద్యవృత్తి తాపసి సదాశివరావు

వైద్యవృత్తిలో నిరంతరం తపస్సు చేసి సిద్ధి పొందిన తాపసి కాసరనేని సదాశివరావు. తాను మాత్రమే తన సహదర్మ చారిణి, పుట్టిన మగ పిల్లలు ఐదుగురు వై కావడం, వారి సంతానంలోనూ వైద్యవృత్తిలో స్థిరపడడం బట్టి ఆయనకు వైద్యవృత్తి పట్ల గల నిబద్ధత స్పష్టం అవుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని, గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, తక్కెళ్ళపాడు శివారు రామచంద్ర పాలెం (గారపాడు) గ్రామంలో భాగ్యమ్మ, రామ శాస్త్రులు దంపతులకు 1923 అక్టోబరు 13వ తేదిన డాక్టర్ కాసరనేని సదాశివరావు (1923 – 2012) జన్మించారు. మధ్యతరగతి రైతు కుటుంబం నుంచి వచ్చిన సదాశివరావు వైద్యవిద్య నభ్యసించి, శస్త్రవైద్య నిపుణులుగా పేరొందారు. విశాఖపట్నం లో వైద్య విద్యను పూర్తి చేసి బెనారస్ విశ్వవిద్యాలయంలో గుండె మరియు శస్త్ర చికిత్సలు విభాగంలో స్నాతకోత్తర విద్య ( పోస్టుగ్రాడ్యుయేషన్) పూర్తిచేసి, గుంటూరు నగరంలో "పీపుల్స్ నర్సింగ్ హెమ్" అనే ప్రజా వైద్య శాలను స్థాపించారు.దాదాపు అర్ధ శతాబ్దం పాటు వైద్యవృత్తిలో కొనసాగారు. ఆయన భార్య జయప్రదాంబ, అలాగే, వారి సంతానం మరియు మనవళ్లు, మనవరాళ్లు కూడా వైద్య రంగంలో స్థిరపడడం విశేషం. సదాశివరావు పేద ప్రజల పట్ల ఉదారంగా వ్యవహరించేవారు. వృత్తిలో మానవత్వాన్ని, వృత్తి విలువలను తు.చ. తప్పక పాటిస్తూ, మంచి హస్తవాసిగల డాక్టరుగా పేరు తెచ్చుకున్నారు. ఆయన నిర్వహించిన అనేక శస్త్ర చికిత్సలు విజయవంతం కావడంతో ఆయన హస్తవాసి మంచిదని పేరొచ్చింది, ఆయన చేతులతో ఆసుపత్రులు ప్రారంభించడం మంచిదని భావించిన ఆసుపత్రుల నిర్వాహకులు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలో సుమారుగా 800 ఆసుపత్రులను ఆయన చేత ప్రారంభింప చేయడం విశేషం.

# బెల్లం టీ ఇలా చేసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు?

బెల్లం టీ ని తాగడం వల్ల మన ఆరోగ్యానికి చాలా మేలు కలుగుతుంది. బెల్లం టీ వల్ల మన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు ఏమిటి? ఇంకా అలాగే ఈ టీనిఎలా తయారు చేసుకోవాలి? వంటి పూర్తి వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. ముందుగా ఈ బెల్లం టీని ఎలా తయారు చేసుకోవాలి ఇంకా తయారీకి కావల్సిన పదార్థాలు ఏమిటి.. అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. ముందుగా మీరు ఒక గిన్నెలో 2 కప్పుల నీటిని తీసుకోవాలి. ఆ తరువాత ఇందులో 2 లేదా 3 యాలకులు, ఒక చిన్న ముక్క దాల్చిన చెక్క, 4 లేదా 5 దంచిన మిరియాలు, 10 తులసి ఆకులు ఇంకా అర ఇంచు ముక్క దంచిన అల్లం వేసి నీటిని మరిగించాలి. ఆ నీరు మరిగిన తరువాత ఒక టీ స్పూన్ టీ పౌడర్, 2 లేదా 3 టేబుల్ స్పూన్ల బెల్లం తురుము వేసి మరిగించాలి. దీనిని బెల్లం కరిగే దాకా మరిగించిన తరువాత స్టవ్ ఆఫ్ చేసి వడకట్టి తాగాలి. ఇలా తయారు చేసిన బెల్లం టీని ఉదయం పూట పరగడుపున లేదా అల్పాహారం చేసిన అరగంట తరువాత తాగాలి.ఇలా మీరు ఈ బెల్లం టీ ని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇంకా తరుచూ ఇన్ఫెక్షన్ ల బారిన పడకుండా ఉంటాము. ఈ టీ ని తాగడం వల్ల జీర్ణశక్తి బాగా మెరుగుపడుతుంది.అలాగే పొట్ట సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి.ఇంకా శరీరంలో పేరుకుపోయిన కొవ్వు తొలిగిపోతుంది. బరువు తగ్గడంలో కూడా ఈ టీ మనకు బాగా సహాయపడుతుంది. అలాగే శరీరంలో జీవక్రియల రేటును పెంచి క్యాలరీలు ఎక్కువగా ఖర్చయ్యేలా చేయడంలో కూడా ఈ బెల్లం టీ మనకు దోహదపడుతుంది. ఈ టీని తాగడం వల్ల రక్తహీనత సమస్య కూడా ఈజీగా తగ్గుతుంది.అలాగే బెల్లంలో ఉండే ఐరన్ రక్తహీనతను తగ్గించడంలో సహాయపడుతుంది.అంతేకాకుండా ఈ టీని తాగడం వల్ల పొటాషియం, విటమిన్ ఎ, విటమిన్ బి, క్యాల్షియం ఇంకా మెగ్నీషియం వంటి ఎన్నో పోషకాలు అందుతాయి.

# చిన్నపిల్లల ఆరోగ్యాన్ని పాడు చేసే ఆహారాలు..!

సాధారణంగా పిల్లల ఆరోగ్య విషయంలో తల్లిదండ్రులు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా చిన్నపిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ఎంత దృష్టి సారిస్తారో పెద్దయిన తర్వాత వారి ఆరోగ్యం అంత బాగా ఉంటుంది.అందుకే ఆహారం విషయంలో వారికి ఎలాంటి ఆహారాలు ఇస్తున్నాము అన్న విషయాన్ని తప్పకుండా గుర్తించుకోవాలి. అలా కాకుండా వారికి చిన్నప్పటి నుంచే ప్రాసెస్డ్ ఫుడ్, బేకరీ ఫుడ్ , జంక్ ఫుడ్, ప్యాకేజ్డ్ స్నాక్స్ వంటివి ఇస్తే మాత్రం చిన్నవయసులోనే షుగర్ రక్తపోటు వంటి సమస్యలతో ఇబ్బంది పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఇలాంటి ఫుడ్ పిల్లలు తినడం వల్ల సెరటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోతుందట. దీనివల్ల ఇలాంటి ఆహారాలు తీసుకునే వారి మెదడు మొద్దు మారిపోవడం, ఏకాగ్రత దూరం అవ్వడం, డిప్రెషన్ కి గురవడం లాంటి సమస్యలను ఎదుర్కొంటారు. ఇక చిన్న పిల్లలకు స్వీట్స్ లాంటి ఆహార పదార్థాలను కూడా ఇవ్వకూడదు. స్వీట్స్ , కేక్స్ , బేబీ ఫుడ్స్, ఐస్ క్రీమ్లలో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. వీటిని తిన్నవారికి చిన్న వయసులోనే షుగర్ వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ఇలాంటి ఆహార పదార్థాలను కూడా వారు తినకపోవడం మంచిది. ఇంకా చెప్పాలంటే పిల్లలు కలర్ఫుల్ ఆహారాన్ని తినడానికి ఎక్కువగా ఇష్టపడతారు. అలాంటి ప్యాకేజీ ఫుడ్ ను ఎట్టి పరిస్థితుల్లో కూడా వారికి ఇవ్వకూడదు. వీటిలో ఉండే రసాయనాలు పిల్లల మెదడుపై ప్రభావితం చూపిస్తాయి. కొంచెం కష్టమైనా సరే పిల్లలకు శుభ్రమైన ఆరోగ్యకరమైన ఆహారాలను అందివ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇక చాక్లెట్స్, ఐస్ క్రీమ్ వంటి వాటిని పిల్లలకి సాధ్యమైనంత దూరంగా ఉంచండి. వీటిలో ఉండే కెఫిన్ వారి ఆరోగ్యం పై చెడు ప్రభావాన్ని చూపుతుంది. దీనివల్ల చిన్న పిల్లల్లో నిద్రలేమి, తలనొప్పి, కడుపులో మంట , నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. కాబట్టి చిన్న పిల్లల ఆరోగ్యం పై తప్పకుండా జాగ్రత్త వహించాలి.

# చేపనూనె ఆరోగ్య ప్రయోజనాలు..?

మనలో చాలామంది ఏదో ఒక సందర్భంలో చేపనూనె గురించి వినే ఉంటారు. చేపనూనె వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఒమేగా 3 ఫాటీ యాసిడ్స్ ను కలిగి ఉన్న చేపనూనె ఎన్నో ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టడంలో ఉపయోగపడుతుంది. ఎక్కువ జిడ్డు కలిగిన చేపల కణజాలం నుండి చేపనూనెను సేకరిస్తారు. సాల్మన్, వైట్ ఫిష్, హెర్రింగ్, సర్డినెస్ అనే చేపల నుంచి ప్రధానంగా ఈ నూనెను సేకరిస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం వారానికి రెండు చేపలు తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. చేప నూనెలో 30 శాతం ఒమేగా 3 ఫాటీ ఆసిడ్స్ మిగిలిన 70 శాతం ఖనిజాలతో,పోషకాలు ఉంటాయి. చేప నూనె అనేక సమర్ధవంతమైన ఆరోగ్య లక్షణాలను కలిగి ఉండటంతో పాటు క్యాన్సర్ సమస్యకు చెక్ పెట్టడంలో ఉపయోగపడుతుంది. బరువును తగ్గించే విషయంలో చేపనూనె ఎంతో సహాయపడుతుంది. చేపనూనె తీసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. అధిక బరువును తగ్గించడంతో పాటు ఎన్నో సమస్యలకు చెక్ పెట్టడంలో చేపనూనె సహాయపడుతుంది. చేపనూనె వల్ల మానసిక వ్యాధులు దూరమయ్యే అవకాశాలు ఉంటాయి. వృద్ధాప్యంలో దృష్టి లోపం రాకుండా చేయడంలో చేపనూనె ఉపయోగపడుతుంది. నొప్పులను నివారించుటలో చేపనూనె ఉపయోగపడుతుంది. చేపనూనె వాడటం వల్ల శారీరక, మానసిక ఎదుగుదలకు సంబంధించిన సమస్యలు దూరమవుతాయి. రొమ్ము క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్ మరియు పెద్దప్రేగు కాన్సర్ లాంటి సమస్యలను చేప నూనె దూరం చేస్తుంది. వ్యాధినిరోధక శక్తిని పెంచడంలో చేప నూనె ఉపయోగపడుతుంది.

# శాఖ బాబుది.. సంతకం చినబాబుది

- రూ.2,000 కోట్ల 'ఫైబర్ ఫ్రాడ్'కు నారా లోకేశ్ సంతకమే రుజువు
- ఐదేళ్లూ చంద్రబాబు వద్దే పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ
- ఆ శాఖ పరిధిలోనిదే ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్
- తన తండ్రి శాఖలోని ఫైల్ తెప్పించుకున్న లోకేశ్
- 2017 నవంబర్ 12న బీబీఎన్ఎల్‌తో ఎంవోయూ ఫైల్‌పై సంతకం
- కేంద్రం అనుమతి లేకుండా అంచనా వ్యయం రూ.500 కోట్లకుపైగా పెంచేసి వేమూరి సంస్థకు ఖరారు
- గల్లా జయదేవ్ కంపెనీలోనే సెట్‌టాప్ బాక్సుల తయారీ!

*తండ్రి ముఖ్యమంత్రి.. తనయుడు మంత్రి.. తండ్రి అధికారంతో తనయుడి నిర్వాకం.. తండ్రీ తనయుల తోడుతో పేట్రేగిన బినామీ వెరసి రూ.2 వేల కోట్లు ఖజానాకు తూట్లు! ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టులో అప్పటి సీఎం చంద్రబాబు, నాటి ఐటీ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి లోకేశ్, ఐటీ సలహాదారు వేమూరి హరికృష్ణలు సాగించిన అక్రమాల బాగోతం ఇదీ..!*

అమరావతి (అక్షరభూమి) : గత సర్కారు హయాంలో చేపట్టిన ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టులో రూ.రెండు వేల కోట్లకుపైగా అక్రమాలు జరిగినట్లు మంత్రివర్గ ఉప సంఘం నిర్ధారించింది. ఇందులో కీలక పాత్ర పోషించిన వేమూరి హరికృష్ణప్రసాద్ ఆదివారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఫైబర్ గ్రిడ్ ఫైలుపై నారా లోకేశ్ సంతకం చేశారని అంగీకరించారు. ఆరోజు నాటి సీఎం చంద్రబాబు అందుబాటులో లేకపోవడంతో సంతకం చేశారన్నారు. అయితే అంతలోనే సర్దుకుని లోకేశ్ సంతకం చేయలేదంటూ బుకాయించడం గమనార్హం. బహిరంగ మార్కెట్లో అత్యంత నాణ్యమైన సెట్‌టాప్ బాక్స్ రూ.2,200కే దొరుకుతుండగా గత సర్కారు రూ.4,400 చొప్పున కొనుగోలు చేసింది. వీటిని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ కంపెనీలో ఉత్పత్తి చేసినట్లు అంగీకరించిన వేమూరి ఆ తర్వాత కేవలం 40 వేల బాక్స్‌లు మాత్రమే ఉత్పత్తి చేశామంటూ మాట మార్చారు. ఫైబర్ గ్రిడ్ కుంభకోణంపై సీబీఐ విచారణకైనా తాను సిద్ధమంటూ మీడియాతో పేర్కొన్న వేమూరి ఆ తర్వాత కేసులో తనను ఇరికించడానికి ప్రయత్నిస్తే హైకోర్టును ఆశ్రయిస్తానంటూ బెదిరింపులకు దిగారు.

### దోపిడీకి అడ్డాగా ఫైబర్ గ్రిడ్...

రాష్ట్రంలో ఒకే కనెక్షన్‌తో ఇంటింటికీ కారు చౌకగా కేబుల్ టీవీ ప్రసారాలు, ఇంటర్నెట్, ఫోన్ సౌకర్యాన్ని కల్పించడానికి ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టును చేపట్టామని 2015లో అప్పటి సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇందుకోసం పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన శాఖ పరిధిలో ఏపీఎస్ఎఫ్ఎల్(ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్)ను ఏర్పాటు చేశారు. ఈ శాఖను ఐదేళ్లపాటూ చంద్రబాబే నిర్వహించారు. వేమూరి హరికృష్ణప్రసాద్ ఆగస్టు 10, 2012 నుంచి సెప్టెంబర్ 8, 2015 వరకూ టెరా సాఫ్ట్ అనుబంధ సంస్థ టెరా క్లౌడ్ సొల్యూషన్స్ లిమిటెడ్ డైరెక్టర్‌గా ఉన్నారు. చంద్రబాబుకు బినామీ అయిన వేమూరిని ప్రభుత్వానికి ఐటీ సలహాదారుగా నియమించుకున్నారు. ఏపీ ఫైబర్ గ్రిడ్‌లో తొలిదశ పనులను రూ.333 కోట్లతో చేపట్టేందుకు ఆగస్టు 26, 2015న ఇన్‌క్యాప్(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) నుంచి ఏపీఎస్ఎఫ్ఎల్ అనుమతి తీసుకుంది. ఈ టెండర్ మదింపు కమిటీలో ఐటీ సలహాదారు హరికృష్ణప్రసాద్‌ను చేర్చింది. తూర్పుగోదావరి జిల్లాలో ఈపాస్ యంత్రాల సరఫరాలో గోల్‌మాల్ చేసిన టెరా సాఫ్ట్‌ను ఏపీటీఎస్(ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్) సంస్థ బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. కానీ.. ఫైబర్ గ్రిడ్ తొలి దశ టెండర్‌ను ఆగస్టు 30, 2015న టెరా సాఫ్ట్‌కు కట్టబెట్టారు. టెరా సాఫ్ట్‌కుకేబుళ్లు, నెట్ వర్క్ ఆపరేషన్ సెంటర్(నాక్), హెడ్ ఎండ్ అనుభవం ఉన్నట్లు సిగ్నమ్ కంపెనీ పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి పనులు దక్కించుకున్నారు. సిగ్నమ్ కంపెనీ సీఈ, ఎండీ దీనిపై ఇప్పటికే ఫిర్యాదు చేయడం గమనార్హం. నాసిరకం కేబుల్, క్లాంప్‌లతో టెరా సాఫ్ట్ తొలి దశలోనే రూ.333 కోట్లను దోచేసింది.

### సంబంధిత శాఖ మంత్రే సంతకం చేయాలి..

నిబంధనల మేరకు సంబంధిత శాఖను నిర్వహిస్తున్న మంత్రి మాత్రమే ఆ శాఖలోని ఫైళ్లపై సంతకం చేయాలి. ఇతర మంత్రులు సంతకం చేయకూడదు. 2017లో ఏప్రిల్ 3న చంద్రబాబు తన కుమారుడు లోకేశ్‌ను కేబినెట్‌లోకి తీసుకుని ఐటీ, పంచాయతీరాజ్ శాఖలు అప్పగించారు. లోకేశ్ మంత్రి కాగానే హరికృష్ణ ప్రసాద్‌ను 2017 సెప్టెంబర్ 14న ఏపీఎస్ఎఫ్ఎల్‌కు సలహాదారుగా నియమించారు. అప్పటి నుంచి టెండర్లలో గోల్ మాల్ పెద్ద ఎత్తున జరిగింది. లోకేశ్ వద్ద ఉన్న శాఖలకు, ఏపీఎస్ఎఫ్ఎల్‌కు సంబంధం లేదు. కానీ ఏపీఎస్ఎఫ్ఎల్‌కు చెందిన ఫైల్ పై లోకేశ్ సంతకాలు చేశారు. భారత్ నెట్ ఫేజ్ 2కి సంబంధించిన ఎంవోయూ ఫైల్ పై నారా లోకేశ్ 2017 నవంబర్ 12న సంతకం చేశారు.

బీబీఎన్ఎల్(భారత్ బ్రాండ్ బ్యాండ్ నెట్ వర్క్ లిమిటెడ్) రెండో దశకు సంబంధించి ఆ సంస్థకూ ఏపీఎస్ఎఫ్ఎల్‌కూ మధ్య ఎంవోయూను ఆమోదిస్తూ సంబంధిత ఫైల్‌పై లోకేశ్ సంతకం చేశారు. ఇక్కడే లోకేశ్ అడ్డంగా దొరికారు. బీబీఎన్ఎల్ మార్గదర్శకాలను తుంగలో తొక్కి.. టెండర్ షరతులను సడలించి.. నిబంధనలు ఉల్లంఘించి.. అర్హత లేని టెరా సాఫ్ట్‌వేర్ లిమిటెడ్‌కు 11.26 శాతం అధిక ధరలకు పనులు అప్పగించారు. దీనివల్ల అంచనా వ్యయం రూ.907.94 కోట్ల నుంచి రూ.1410 కోట్లకు పెరిగింది. వీటికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదు.

### అంతులేని అక్రమాలు..

2014-2019 మధ్య సుమారు రూ.3,492 కోట్లవిలువైన పనులను ఫైబర్ గ్రిడ్‌లో చేపట్టారు. ఫేజ్ 1 కింద రూ.333 కోట్ల పనులు, సీసీ కెమెరాల కొనుగోలుకు రూ.959 కోట్లు, భారత్ నెట్‌కు రూ.1,600 కోట్లు, సెట్ టాప్ బాక్సుల కొనుగోలును రూ.600 కోట్లతో చేపట్టారు. ఫైబర్ గ్రిడ్ పరికరాలు, సెట్ టాప్ బాక్సులు, కేబుళ్ల కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుంది. చైనా కంపెనీలతో హరికృష్ణప్రసాద్ ముందుగానే డీల్ కుదుర్చుకుని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ కంపెనీలో నాసిరకమైన సెట్ టాప్ బాక్స్‌లను తయారు చేయించి ఖజానాను దోచేశారు. కొనుగోలు చేసిన 12 లక్షలసెట్‌టాప్ బాక్సుల్లో 3.40 లక్షల బాక్స్‌లు పని చేయకపోవడమే ఇవి ఎంత నాసిరకంగా ఉన్నాయో నిరూపిస్తోంది.

### సాంకేతిక సలహాలు మాత్రమే.. ఇచ్చేవాడిని వేమూరి హరికృష్ణప్రసాద్

ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు టెండర్ కమిటీలో తాను లేనని.. సాంకేతిక సలహాలు మాత్రమే ఇచ్చేవాడినని టీడీపీ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారుడు వేమూరి హరికృష్ణప్రసాద్ చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. టెండర్ దక్కించుకున్న సంస్థకు, తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. సెట్ టాప్ బాక్సు ఒక్కొక్కటి రూ.3,700కు కొనుగోలు చేశామని చెప్పారు. 10 లక్షల బాక్సులకు టెండర్లు వేస్తే సుమారు 7 సంస్థలు పాల్గొన్నాయని.. అందులో తక్కువ రేటు ఉన్న దాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏపీలో ప్రస్తుతం 10 లక్షల మంది ఏపీ ఫైబర్‌నెట్‌ను వినియోగిస్తున్నారని.. వాటి పనితీరు ఎలా ఉందో వారిని విచారించుకోవచ్చన్నారు. తాను అవకతవకలకు పాల్పడలేదన్నారు. ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

# పంజాబ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెస్ట్.. 'ఇండియా' కూటమిపై కేజ్రీవాల్ క్రేజీ కామెంట్స్

- పంజాబ్ ఆప్ సర్కార్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెస్ట్
- ఇండియా కూటమిపై కేజ్రీవాల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్
- భగవంత్ మాన్ సర్కార్‌పై క్రేజీ కామెంట్స్

న్యూఢిల్లీ (ఎఎంఎస్) : కేంద్రంలో బీజేపీ సర్కార్‌ను ఓడించేందుకు ప్రతిపక్ష పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడిన విషయం తెలిసిందే. అయితే, పంజాబ్‌లోని ఆప్ సర్కార్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెస్ట్ కావడం పెను దుమారం లేపింది. ఈ నేపథ్యంలో ఇండియా కూటమిపై తాజాగా ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏది ఏమైనా తాము ఇండియా కూటమితోనే ముందుకు సాగుతామని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. కాగా, సీఎం అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తాము ఇండియా కూటమి విషయంలో పూర్తి నిబద్ధతతో ఉన్నామన్నారు. ఇండియా కూటమితోనే ముందుకు సాగుతామన్నారు. కూటమి నుంచి బయటకు వెళ్లే ప్రసక్తే లేదన్నారు. డ్రగ్స్ కేసులో నిన్న పంజాబ్ పోలీసులు ఒక నేతను అరెస్టు చేశారని విన్నాను. దానికి సంబంధించిన వివరాలు నా దగ్గర లేవు. దీనిపై మీరు పంజాబ్ పోలీసులతో మాట్లాడుకోండి. భగవంత్ సింగ్ మాన్ ప్రభుత్వం మాత్రం నిబద్ధత కలిగినది. ఆప్ ప్రభుత్వం డ్రగ్స్ సమస్యను ముగించే లక్ష్యంతో ఉంది. ఈ పోరాటంలో ఎవరినీ విడిచిపెట్టదు అంటూ ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు చేశారు.

# కర్ణాటక బంద్ ఎఫెక్ట్: స్కూల్స్ మూసివేత.. 44 విమానాలు రద్దు

చెన్నై (ఎఎంఎస్) : కావేరి జలాల సమస్య కారణంగా కర్ణాటక రాష్ట్రంలో శుక్రవారం బంద్ కొనసాగుతోది. పొరుగున్న ఉన్న తమిళనాడుకు కావేరి నీటి విడుదల చేయాలని కావేరీ వాటర్ మేనేజ్ మెంట్ అథారిటీ కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించడాన్ని వ్యతిరేకిస్తూ కన్నడ ఒక్కూట రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. ఇందుకు దాదాపు 1900 కన్నడ సంఘాలు మద్దతు తెలిపాయి. వీటిలో హోటళ్లు, సినీరంగం, ప్రైవేటు క్యాబ్‌లు, ఆటో సంఘాలు, ప్రైవేటు విద్యాసంఘాలు ఉన్నాయి. బంద్‌లో భాగంగా నిరసనల్లో పాల్గొన్న వివిధ సంఘాలకు చెందిన 60 మంది ఆందోళనకారులను కర్ణాటక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బంద్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని బెంగళూరు రూరల్ ఏఎస్పీ మల్లికారం?రోజున బాలదండి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కర్ణాటక బంద్ ఎఫెక్ట్ కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుపై పడింది. బంద్ కారణంగా రవాణా సౌకర్యాలు దెబ్బతినడంతో శుక్రవారం ప్రయాణించాల్సిన ఏకంగా 44 విమానాలు రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. వీటిలో 22 విమానాలు బెంగుళూరులో ల్యాండ్ అయ్యేవి కాగా మరో 22 విమానాలు ఇక్కడి నుంచి టేకాఫ్ కావాల్సినవి ఉన్నాయి. ప్రయాణికులకు సకాలంలో సమాచారం అందించడం ద్వారా వారు తమ టికెట్లను రద్దు చేసుకున్నట్లు పేర్కొన్నారు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బంద్ ప్రభావం కొనసాగనుంది. బెంగళూరు నగరంలో పోలీసులు సెక్షన్ 144 విధించారు. ప్రజలు గుంపులుగా బయటకు వచ్చి ర్యాలీలు, నిరసనలు చేపట్టకూడదని, అయిదుగురు కంటే ఎక్కువ మంది సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. 1,900కు పైగా సంఘాలు బంద్‌కు మద్దతు తెలిపాయి. బెంగళూరుతో సహా రాష్ట్రంలో కిరాణా దుకాణాలు, ఇతర షాప్‌లను మూసేశారు. అయితే ఆసుపత్రులు, అంబులెన్స్‌లు, ఫార్మసీలు వంటి అత్యవసర సేవలు కొనసాగుతున్నాయి.

# తమిళనాడుకు కావేరి నీటి విడుదల.. నిన్న కర్ణాటక బంద్

శివాజీనగర (ఎఎంఎస్) : తమిళనాడుకు కావేరి నీటి విడుదలను వ్యతిరేకిస్తూ శుక్రవారం కన్నడ ఒక్కూట అఖండ కర్ణాటక బంద్‌కు పిలుపునిచ్చింది. ఇందుకు 100కు పైగా సంఘాలు మద్దతు ప్రకటించాయి. మంగళవారమే బెంగళూరు బంద్ దాదాపు జయప్రదమైంది. రాష్ట్ర బంద్ సందర్భంగా వాహన సంచారం, అంగళ్లు, హోటల్, సినిమా థియేటర్లు, మాల్స్, పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అన్నీ బంద్ అయ్యే అవకాశముంది. ఒక్కూట వాటాళ్ నాగరాజ్ మాట్లాడుతూ శాంతియుతంగా బంద్ జరుగుతుందన్నారు. బెంగళూరుతో పాటుగా అన్ని జిల్లాల్లో కూడా ధర్నా, ర్యాలీలు జరుపుతామని కరవే అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ శెట్టి తెలిపారు. హోటళ్లు, సినీరంగం, ప్రైవేటు క్యాబ్‌లు, ఆటో సంఘాలు, ప్రైవేటు స్కూళ్ల సంఘాలు సంఘీభావం తెలిపాయి. వాహనాలు ఉండకపోవడం వల్ల స్కూళ్లు కూడా మూతపడవచ్చు. ఆర్టీసీ రవాణా బస్సుల సంచారం కూడా తక్కువగా ఉండవచ్చు. రాష్ట్రమంతటా అన్ని సినిమా థియేటర్లు బంద్ కానున్నాయి. అనేకమంది నటీనటులు మద్దతు తెలిపారు. అనేక విశ్వవిద్యాలయాల్లో పరీక్షలను వాయిదా వేశారు. ప్రధాన రహదారుల్లో రాస్తారోకోలు చేయాలని సంఘాలు నిర్ణయించాయి.

### బంద్ చట్టవిరుద్ధం: నగర సీపీ

కర్ణాటక బంద్ నేపథ్యంలో బెంగళూరులో గట్టి పోలీస్ బందోబస్తు కల్పించినట్లు పోలీస్ కమిషనర్ బీ దయానంద్ విలేకరుల సమావేశంలో తెలిపారు. శుక్రవారం ఎక్కడా ధర్నా, ర్యాలీ, ఊరేగింపులకు అవకాశం లేదు. గురువారం రాత్రి నుండే 144 సెక్షన్ జారీలోకి వచ్చింది. బంద్ అనేవారికి నోటీసులు ఇస్తాము. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల ప్రకారం బంద్‌కు పిలుపునివ్వడం చట్ట విరుద్ధం. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పోలీస్ శాఖ పనిచేస్తుందని చెప్పారు. బంద్ సమయంలో ప్రభుత్వ ఆస్తిపాస్తులకు నష్టం కలిగిస్తే పిలుపునిచ్చినవారే బాధ్యులవుతారన్నారు. నగరవ్యాప్తంగా పెద్దసంఖ్యలో పోలీసులను మోహరించినట్లు తెలిపారు.

### యథావిధిగా ఆర్టీసీ, సిటీ బస్సులు

క్రవారం కర్ణాటక బంద్ అయినప్పటికీ కేఎస్ఆర్‌టీసీ, బీఎంటీసీ బస్సులను యథావిధిగా నడపాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఉద్యోగులు మామూలుగానే డ్యూటీలకు రావాలని ప్రకటించారు.

# ముందస్తు బెయిల్ పిటిషన్.. ఏపీ హైకోర్టులో నారా లోకేష్‌కు ఎదురు దెబ్బ




## విచారణకు సహకరించాల్సిందే..

గుంటూరు (ఎఎంఎస్) : ఇన్నర్ రింగ్‌రోడ్ అలైన్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌కు ఎదురు దెబ్బ తగిలింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు శుక్రవారం డిస్పోస్ చేసింది. అంతేకాదు ఈ కేసులో లోకేష్‌కు నోటీసులు ఇచ్చి విచారించాలని ఏపీ సీఐడీని ఆదేశించిన కోర్టు.. మరోవైపు విచారణకు సహకరించాల్సిందేనని నారా లోకేష్‌కు తేల్చి చెప్పింది. ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో ఏ14గా నారా లోకేష్ పేరు చేరుస్తూ ఈ మధ్యే విజయవాడ కోర్టులో ఏపీ సీఐడీ మెమో దాకలు చేసింది. దీంతో అరెస్ట్ భయంతో.. నారా లోకేష్ ముందస్తు బెయిల్ కోసం ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఇవాళ ఆ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. లోకేష్ తరపున దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించగా.. ఏపీ సీఐడీ తరపున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపించారు. ఈ క్రమంలోనే లోకేష్‌కు 41-ఏ కింద నోటీసులు ఇచ్చి విచారణ జరపాలని హైకోర్టు ఆదేశించింది. "మేము చట్ట ప్రకారమే నడుచుకుంటున్నాం. దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని లోకేష్‌ను ఆదేశించండి" అని ఏజీ శ్రీరామ్ చేసిన అభ్యర్థనను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. 41-ఏ కింద నోటీసులు ఇచ్చి విచారించుకోవచ్చని సూచించింది. ఆ ఆదేశాలను అనుసరించి నోటీసులు ఇచ్చేందుకు ఢిల్లీ బయల్దేరింది ఏపీ సీఐడీ. మరికాసేపట్లో ఏపీ సీఐడీ అధికారులు లోకేష్‌ను కలిసి నోటీసులు అందించే అవకాశాలు ఉన్నాయి.

# విధుల్లో చేరిన రాజమండ్రి జైలు సూపరిండెంట్ రాహుల్

తూర్పుగోదావరి (ఎఎంఎస్) : రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరిండెంట్ రాహుల్ విధుల్లోకి చేరారు. కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో భార్య మృతి చెందడంతో సూపరిండెంట్ రాహుల్ విధులకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. జైలు సూపరిండెండెంట్ భార్య అనారోగ్య కారణాలతో సెలవు పెడితే పచ్చ మీడియా విపరీతార్థాలు తీసింది. దీంతో పచ్చ మీడియా తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. కాగా, రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ భార్య ఎస్ రాహుల్ భార్య కిరణ్మయి(46) ఈ నెల 15న మృతిచెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న కిరణ్మయి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. మృతదేహాన్ని అంబులెన్సులో గుంటూరు తీసుకెళ్లారు. భార్య అనారోగ్యం కారణంతో జైలు సూపరింటెండెంట్ రాహుల్ సెలవులపై వెళ్లారు. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న నేపథ్యంలో ఒత్తిడిపై రాహుల్ సెలవులపై వెళ్లారని పలువురు దుష్ప్రచారం చేశారు. ఈ క్రమంలో ఎస్పీ జగదీష్ స్పందిస్తూ ఆ వార్తలను కొట్టిపారేశారు. భార్య అనారోగ్యం కారణంగానే ఆయన సెలవుపై వెళ్లారని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన అవాస్తవ కథనాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై ఒత్తిళ్లు లేవని, తమ డ్యూటీ తాము చేస్తున్నానమని స్పష్టం చేశారు.

# కోడుమూరులో సైబర్ నేరగాళ్ల మోసం.. ఖాతాల నుంచి డబ్బు మాయం

కర్నూలు (ఎఎంఎస్) : కోడుమూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వ్యక్తుల ఖాతా నుంచి డబ్బులు మాయం చేశారు. రిజిస్టర్ కొరకు ఆధార్ ఈకేవైసీ చేయగానే అకౌంట్ నుంచి డబ్బులు మిస్ అయ్యాయి. హుసేన్ అనే వ్యక్తి అకౌంట్ నుంచి మూడు రోజుల్లో రోజుకు 10 వేలు చొప్పున కేటుగాళ్లు డ్రా చేశారు. వినోద్ అనే వ్యక్తి అకౌంట్ నుంచి విడతల వారిగా సైబర్ ఆగంతకులు 17 వేలు తీసుకున్నారు.

**IndoStar Home Finance Private Limited**

**Regd. Office: -** Unit No. 305, 3rd Floor, Wing 2/E, Corporate Avenue, Andheri- Ghatkopar Link Road, Chakala, Andheri (East), Mumbai – 400093
**CIN :** U65990MH2016PTC271587 **Tel:** +91 22 45107701
**Email:** contact@indostarhfc.com; **Website:** www.indostarhfc.com

**నోటీస్**

నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ (రిజర్వ్ బ్యాంక్) ఆదేశాలు, 2021 యొక్క మాస్టర్ డైరెక్షన్‌లోని పేరా 93 ప్రకారం ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, షెల్టర్ నెం: 306 + 307లో ఉన్న కంపెనీ బ్రాంచ్ ఆఫీస్ గురించి నోటీసు ఇందుమూలంగా ఇవ్వబడింది. 307, 3వ అంతస్తు, కెకెసి కాంప్లెక్స్, మెయిన్ రోడ్, వార్డ్ నెం.14, ఎల్‌ఐసి కార్యాలయం పక్కన, ఎదురుగా రైల్వే స్టేషన్, చీరాల (మండలం) ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523155, డిసెంబర్, 2023 పనివేళల ముగింపు నుండి మూసివేయబడుతుంది. ఏదైనా సహాయం అవసరమైతే, మీరు పైన పేర్కొన్న విధంగా సమీపంలోని బ్రాంచ్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు లేదా contact@indostarhfc.comకి ఇమెయిల్ పంపవచ్చు.
ఈ నోటీసును కంపెనీ వెబ్‌సైట్ (www.indostarhfc.com)లో యాక్సెస్ చేయవచ్చు.

ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోసం
ఎస్‌డి/-
నిధి సదాని
కంపెనీ సెక్రటరీ

తేదీ:30-09-2023

Printed by **DAVULURI HANAUMANTHA RAO** Published by **DAVULURI HANAUMANTHA RAO** Owned by **DAVULURI HANAUMANTHA RAO** and Printed at **Janam Printers,** D.No.11-846,Old Bank Road, IInd Line, Nagaralu, Amaravathi Road, Guntur A.P. and Published at D.No.11-846,Old Bank Road, IInd Line, Nagaralu, Amaravathi Road, Guntur Andhra Pradesh, A.P.,Editor:**DAVULURI HANAUMANTHA RAO**.Cell: 9949629267;email.nvsjanam@gmail.com